


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి B.A., B.L.
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 10-12-2022 సంపుటి : 04 సంచిక :97 పేజీలు : 4 వెల : రూ 3-00


# ప్రధాని మోదీతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొననున్న సీఎం జగన్

తాడేపల్లి: ప్రధానమంత్రి నరేంద్రమోదీతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొంటారు.సాయంత్రం 5 గంటలకు పలు రాష్ట్రాల సీఎంలు, లెఫ్టినెంట్ గవర్నర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. భారత్‌లో జరగనున్న ఉ-20 సదస్సు సన్నాహకాలపై ఈ సందర్భంగా చర్చించనున్నారు.దేశవ్యాప్తంగా జరగబోతున్న సదస్సుల్లో ఏపీకి కేంద్రం అధిక ప్రాధాన్యతను ఇచ్చింది. ఫిబ్రవరి, ఏప్రిల్‌లో మూడు సదస్సులను ఏపీలో నిర్వహించాలనే యోచనలో ప్రధాని ఉన్నారు. జీ-20 సదస్సు సన్నాహకాలకు విశాఖపట్నం వేదిక కానుంది.కాగా, జీ-20 అధ్యక్ష దేశంగా భారత్ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో.. ఈ ఏడాది డిసెంబర్ నుంచి వచ్చే ఏడాది నవంబర్ వరకు సదస్సులు, వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా దేశంలోని 56 నగరాలు, పట్టణాల్లో వివిధ అంశాలకు సంబంధించి 200 సదస్సులు నిర్వహించబోతోంది. ఏపీ నుంచి విశాఖపట్నాన్ని కేంద్రం ఎంపిక చేసింది.




# రాష్ట్రానికి రెండు వందేభారత్ రైళ్లు.. ఆ రెండు మార్గాల్లోనే!

అమరావతి: రైల్వే శాఖ రాష్ట్రానికి రెండు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను కేటాయించింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వేకు కేంద్ర రైల్వే శాఖ నుంచి వర్తమానం అందింది.దక్షిణ మధ్య రైల్వే పరిధిలో తొలి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను 2023 జనవరిలో సికింద్రాబాద్-విజయవాడ మధ్య నడపాలని నిర్ణయించారు. త్వరలోనే అధికారికంగా తేదీని ఖరారు చేస్తారు.గంటకు 165 కి.మీ. వేగంతో ప్రయాణించడంతోపాటు 1,129 సీటింగ్ సామర్థ్యం కలిగిన ఈ రైలును మొదట సికింద్రాబాద్ నుంచి కాజీపేట మీదుగా విజయవాడ వరకు నడుపుతారు. తరువాత విశాఖపట్నం వరకు పొడిగిస్తారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రెండో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను సికింద్రాబాద్-తిరుపతి మధ్య నడపనున్నారు. ఈ రైలును సికింద్రాబాద్ నుంచి విజయవాడ మీదుగా తిరుపతి వరకు నడపాలని దక్షిణ మధ్య రైల్వేవర్గాలు భావిస్తున్నాయి. ఈ రైలు రూట్‌పై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.



# విశాఖలో జీ20 సదస్సు

హైదరాబాద్, డిసెంబర్ 9, జీ-20 సదస్సుకు విశాఖపట్నం వేదిక కానుంది. ఈ డిసెంబర్ నుంచి వచ్చే ఏడాది నవంబర్ వరకు సదస్సులు, వివిధ కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం నిర్వహించనుంది. జీ-20 అధ్యక్ష దేశంగా భారత్ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో విశాఖపట్నంలో సదస్సు నిర్వహించాలని కేంద్ర సర్కారు నిర్ణయించింది. జీ-20 సదస్సులో భాగంగా దేశంలోని 56 నగరాలు, పట్టణాల్లో వివిధ అంశాలపై 200 వరకు సదస్సులు నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి విశాఖపట్నాన్ని కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. 2023 ఫిబ్రవరి 3, 4 తేదీల్లో, అలాగే ఏప్రిల్ 24వ తేదీన విశాఖపట్నంలో వివిధ అంశాలపై సదస్సు నిర్వహించాలని కేంద్ర సర్కారు నిర్ణయం తీసుకుంది. జీ-20 సదస్సుకు నోడల్ అధికారిగా ప్రోటోకాల్ డైరెక్టర్ ఎం. బాలసుబ్రహ్మణ్యం రెడ్డిని, సెక్యూరిటీ నోడల్ అధికారిగా డీజీపీని నియమించారు. విశాఖపట్నంలో జీ-20 సదస్సు మూడు రోజులు జరగనుంది. ఈ మూడ్రోజుల్లో ఆర్థిక రంగం, వ్యవసాయం, పర్యావరణం, వైద్య, విద్యతో పాటు 37 సమావేశాలు జరుగుతాయని జిల్లా అధికారులు వెల్లడించారు. వేల మంది ప్రతినిధులు హాజరు అవుతారని, వివిధ దేశాల ఆర్థిక మంత్రులు, విదేశాంగ మంత్రులు, సెంట్రల్ బ్యాంక్ గవర్నర్లు పాల్గొంటారని అధికారులు తెలిపారు. అందుకు అనుగుణగా ఏర్పాట్లు పూర్తి చేసేందుకు విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ విశ్వ నాథన్, డీఆర్వో శ్రీనివాస మూర్తి ఇతర జిల్లా అధికారులతో సమావేశమైన దిశానిర్దేశం చేస్తున్నారు. జీ-20 సదస్సు నిర్వహణకు మొత్తం 15 కమిటీలను ఏర్పాటు చేసి, జాయింట్ కలెక్టర్ విశ్వ నాథన్‌ను నోడల్ అధికారిగా నియమించారు. సదస్సుకు వచ్చే అతిథుల కోసం విశాఖపట్నంలోని స్టార్ హోటళ్లలో 703 గదులను రిజర్వ్ చేసేందుకు చర్యలు చేపట్టారు. సదస్సు విశాఖకు వచ్చే వారు రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలనూ వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.ప్రపంచంలోని ఆర్థికంగా బలమైన దేశాలు, వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల అధినేతల వార్షిక సమావేశమే జీ20 సదస్సు, ప్రపంచ జీడీపీలో దాదాపు 85 శాతం వాటా ఈ 20 దేశాలదే. అలాగే ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతలు ఈ 20 దేశాల్లోనే ఉంటారు. జీ-20 సదస్సుకు ఒక్కోసారి ఒక్కో దేశం అధ్యక్షత వహించి నిర్వహణ చేపడుతుంది. జీ-20 శిఖరాగ్ర సదస్సును, చిన్న చిన్న సమావేశాలను అధ్యక్షత వహించే దేశమే నిర్వహిస్తుంది. జీ-20 సభ్యత్వం లేని దేశాలను ఈ సదస్సుకు అతిథిగా ఆహ్వానించడానికి, అటువంటి దేశాలను ఎంపిక చేయడానికి ఆతిథ్య దేశానికి వీలుంటుంది. తూర్పు ఆసియాలో తలెత్తిన ఆర్థిక సంక్షోభం ప్రపంచంలో చాలా దేశాల మీద ప్రభావం చూపిన వేళ 1999లో మొట్టమొదటి జీ-20 సదస్సు బెర్లిన్ లో జరిగింది. అయితే అప్పటికే జీ-8 ఉండగా... ఆ సమయం నాటికి అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న చైనా, బ్రెజిల్, సౌదీ అరేబియా తదితర దేశాలను కలిపి జీ-20 ని ఏర్పాటు చేశారు. మొదట్లో జీ-20 సదస్సుకు దేశాల ఆర్థిక మంత్రులు, కేంద్ర బ్యాంకుల గవర్నర్లు హాజరు అయ్యే వారు. 2008 నాటి ఆర్థిక సంక్షోభం ప్రపంచం మొత్తాన్ని కుదిపేసింది. బ్యాంకులు కుప్పకూలాయి, నిరుద్యోగం అధికంగా పెరిగిపోయింది, ధరలు పెరిగిపోయాయి ఈ పరిణామాలతో జీ-20 సంస్థ ఆయా దేశాల అధ్యక్షులు, ప్రధాన మంత్రులకు ఒక అత్యవసర మండలిగా మారిపోయింది.

# నా ఊపిరి ఆగిపోవాలని అని కోరుకుంటున్నారా!

## వైసిపి నేతలనుద్దేశించి పవన్ కళ్యాణ్ సంచలన ట్వీట్

విజయవాడ డిసెంబర్ 9 జనసేనాని పవన్ కల్యాణ్ వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఈసారి మెరుగైన స్థానాలను సాధించాలని ఆశిస్తున్నారు.. పవన్. ఇప్పటికే జనసేన కౌలు రైతు భరోసా యాత్ర పేరుతో ఆత్మహత్యలకు పాల్పడ్డ కౌలు రైతులకు లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం చేశారు. అలాగే జనవాణి పేరుతో ప్రజల సమస్యలు తెలుసుకునే కార్యక్రమాన్ని పలు జిల్లాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వారి సమస్యలపై అర్జీలు స్వీకరించారు.వచ్చే ఎన్నికల నేపథ్యంలో పవన్ ముందుగా రాష్ట్రంలో



పాదయాత్ర చేయాలని సంకల్పించారు. అయితే భద్రతాపరమైన సమస్యలు తనను చూడటానికి వచ్చే వారితో భారీగా కాలాపహరణం అయ్యే పరిస్థితులు ఉండటంతో దాన్ని విరమించుకున్నారు. బస్సు యాత్ర చేయాలని సంకల్పించారు.ఈ నేపథ్యంలో ఇప్పటికే బస్సు సిద్ధమైంది. ఆర్మీ వాహనాల మాదిరిగా ఆలివ్ గ్రీన్ రంగులో బస్సును సిద్ధం చేశారు. దానికి దుర్గమ్మ పేర్లలో ఒకటైన వారాహి పేరును పెట్టారు. ఈ బస్సు దాడులను తట్టుకునేలా బస్సులోనే ముఖ్య నేతలతో సమావేశాలు నిర్వహించుకునేలా డిజైన్ చేశారు.అలాగే ప్రభుత్వం తన యాత్రను అడ్డుకుని.. కరెంట్ తీసివేస్తే వాహనంలోనే ఫ్లడ్ లైట్లు వేసేలా కూడా ఏర్పాట్లు ఉన్నాయి. అలాగే ఆధునిక సౌండ్ సిస్టమ్ కూడా ఉంది.కాగా పవన్ బస్సుపై వైఎస్సార్సీపీ నేతలు అప్పుడే విమర్శలు మొదలుపెట్టారు. పవన్ కల్యాణ్ బస్సుకు రవాణా శాఖ అనుమతి ఇవ్వదని అంటున్నారు. సాధారణ వాహనాలు ఆర్మీ రంగులో ఉండటానికి నిబంధనలు ఒప్పుకోవని చెబుతున్నారు. అంతేకాకుండా పవన్ పసుపు రంగు వేసుకుంటే సూట్ అవుతుందని.. పరోక్షంగా పవన్ టీడీపీ మనిషేనని ఎద్దేవా చేస్తున్నారు. తాజాగా వైఎస్సార్సీపీ మాజీ మంత్రి పేర్ని నాని పవన్ బస్సు యాత్రపై తీవ్ర విమర్శలు చేశారు.ఈ నేపథ్యంలో పవన్ సంచలన ట్వీట్ చేశారు. మొదట వారు తన సినిమాలను అడ్డుకున్నారని పేర్కొన్నారు. ఆ తర్వాత విశాఖపట్నం వెళ్తే తనను ర్యాలీ చేయకుండా అడ్డుకున్నారని గుర్తు చేశారు. వాహనం నుంచి బయటకు రానీయలేదన్నారు. హోటల్ గది నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నారు. తనను విశాఖ నగరం వదిలేసి వెళ్లాలని బలవంతం చేశారన్నారు. అలాగే మంగళగిరిలోనూ తన కారును వెళ్లనివ్వలేదని చెప్పారు. ఆ తర్వాత తాను నడవటానికి కూడా ఒప్పుకోలేదన్నారు. ఇక ఇప్పుడు నా వాహనం రంగు వారికి సమస్యగా మారిందని ధ్వజమెత్తారు. ఇక ఆ తర్వాత నా ఊపిరి ఆగిపోవాలని అని కోరుకుంటున్నారా అని సంచలన ట్వీట్ చేశారు.ఈ ట్వీట్ లో పవన్ తన సినిమాలకు అతి తక్కువ టికెట్ ధరలు నిర్ణయించడం విశాఖలో తన పర్యటనను పోలీసులు అడ్డుకోవడం హోటల్ నుంచి బయటకు రానీయకపోవడం విశాఖ వదిలి వెళ్లిపోవాలని బెదిరించడం ఇప్పటంలో ఇళ్ల కూల్చివేతకు గురయిన బాధితులను పరామర్శించడానికి వెళ్తుంటే వెళ్లనీయకపోవడం వంటి విషయాలను ప్రస్తావించారు. ఇప్పుడీ ఈ ట్వీట్ వైరల్ గా మారింది.

# బుల్లెట్ రైలు ప్రాజెక్ట్ కోసం..

## 22 వేల చెట్ల నరికివేతకు హైకోర్టు అనుమతి

ముంబై: మహారాష్ట్రలో చేపడుతున్న బుల్లెట్ రైలు ప్రాజెక్టు నిర్మాణం కోసం సుమారు 22 వేల చెట్లను నరికేందుకు బాంబే హైకోర్టు శుక్రవారం అనుమతించింది.ముంబై-అహ్మదాబాద్ మధ్య నడవున్న బుల్లెట్ రైలు ప్రాజెక్టు కోసం ముంబైతోపాటు పొరుగున్న ఉన్న పాల్ఘర్, థానే జిల్లాల్లో విస్తరించి ఉన్న 22,000 మడ చెట్లను నరికేందుకు నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్‌కు(ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీఎల్) అనుమతిస్తున్నట్లు హైకోర్టు వెల్లడించింది..ఈమేరకు చీఫ్ జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ అభయ్ అహుజాతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే షరతులు వర్తిస్తాయని పేర్కొంది. పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, మహారాష్ట్ర తీర మండల నిర్వహణ అథారిటీ మంజూరు చేసిన అనుమతులలో పేర్కొన్న నిబంధనలు, షరతులకు కట్టుబడి ఉండాల్సి ఉంటుందని నేషనల్ హై స్పీడ్ రైల్ కార్పొరేషన్‌ను హైకోర్టు ఆదేశించింది.కాగా ముంబై, పాల్ఘడ్, థానే జిల్లాల్లోని 50,000కు పైగా మడ చెట్లను నరికివేయడం కోసం నేషనల్ హై స్పీడ్ రైల్ కార్పొరేషన్ కోరిన అనుమతిని 2018లో కో-ఆర్డినేట్ బెంచ్ తీరస్కరించింది. ప్రజా ప్రయోజన ప్రాజెక్ట్ కోసం నరికివేత అవసరమైతే అనుమతి కోసం హైకోర్టును ఆశ్రయించవచ్చని సూచించింది. దీంతో ఎన్‌ఎచ్ఆర్ఎస్‌సీఎల్ బాంబే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.ప్రాజెక్టు నిర్మాణం కోసం నరికివేయాల్సిన మడ చెట్ల సంఖ్యలను 50,000 నుంచి 20,000 వరకు తగ్గించామని ఎన్‌హెచ్ఎస్ఆర్ఎస్‌సిఎల్ తరపున న్యాయవాది ప్రహ్లాద్ పరాంజపే కోర్టుకు తెలిపారు. అంతేగాక ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి అన్ని అనుమతులు పొందామని.. దీనికి తోడు నరికిన చెట్లకు బదులుగా ఐదు రెట్లు ఎక్కువ మొక్కలు నాటుతామని హామీ ఇచ్చారు.మడ అడవులకు సమీపంలో ఉన్న రెండు ప్లాట్‌ఫారమ్‌లను కొద్దిగా దూరంగా మార్చాలని, దీనివల్ల నరికివేసే మడ చెట్ల సంఖ్య తగ్గుతుందని పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, మహారాష్ట్ర తీర మండల నిర్వహణ అథారిటీ సూచించాయని పేర్కొన్నారు. ఇందుకు ఎన్‌హెచ్ఎస్ఆర్ఎస్‌సిఎల్ అంగీకరించిందని, దీంతో చెట్ల సంఖ్య 53,467 నుండి 22,000కి తగ్గిందని తెలిపారు.బుల్లెట్ రైలు ప్రాజెక్ట్ కోసం భారీ సంఖ్యలో చెట్లను నరకడంపై బాంబే ఎన్విరాన్‌మెంటల్ యాక్షన్ గ్రూప్ అనే ఎన్జీవో అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో నిషేధిత ప్రాంతంలో ఎలాంటి పేలుడు కార్యక్రమాలు చేపట్టకుండా చూడాలని కోర్టును కోరింది. అలాగే చెట్లు నరకడం వల్ల పర్యావరణంపై పడే ప్రభావాన్ని అంచనా వేయలేదని పేర్కొంది. ఈ పిటిషన్‌పై సుధీర్ఘంగా ఇరు వార్గల వాదనలు విన్న ధర్మాసనం.. డిసెంబర్ 1న రిజర్వ్ చేసిన తీర్పును శుక్రవారం వెల్లడించింది.



# ఆరుజిల్లాల్లో మాండోస్ ఎఫెక్ట్

విశాఖపట్టణం, డిసెంబర్ 9,ఆగ్నేయం బంగాళాఖాతంలో ఏర్పడిన మాండూస్ తుపాను తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్ర వైపు దూసుకొస్తోంది. నైరుతి బంగాళాఖాతం మీదుగా "మాండోస్" గా ఉచ్ఛరించిన తీవ్ర తుపాను దాదాపు 12 కి.మీ వేగంతో పశ్చిమ-వాయువ్య దిశగా వెళ్లి నైరుతి మీదుగా పయనిస్తోంది. ట్రింకోమలీ (శ్రీలంక)కి ఉత్తర-ఈశాన్యంగా 240 కి.మీ., జాఫ్నాకు 270 కి.మీ తూర్పు-ఈశాన్య (శ్రీలంక), కారైకాల్‌కు తూర్పు-ఆగ్నేయంగా 270 కి.మీ, చెన్నైకి ఆగ్నేయంలో 350 కి.మీ. వద్ద కేంద్రీకృతమై ఉంది.మాండోస్ తీవ్ర తుపానుగా మారనుంది. సాయంత్రానికి క్రమంగా బలహీనపడి తుపానుగా మారే అవకాశం ఉంది. పుదుచ్చేరి, శ్రీహరికోట మధ్య మహాబలిపురం వద్ద తీరం దాటనుంది. ఇది పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, అనుకుని ఉన్న దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాలపై ప్రభావం చూపనుంది. ఈ రోజు అర్ధరాత్రి గరిష్టంగా 65-75 కిలోమీటర్ల వేగంతో గంటకు 85 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి.ఈ మాండోస్ తుపాను ప్రభావం దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఎక్కువగాను... ఉత్తర కోస్తాలో స్వల్పంగాను ఉంటుందని తెలిపింది. దక్షిణ కోస్తాలో కొన్ని చోట్లు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, నెల్లూరులో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి. ప్రకాశం,



నెల్లూరు, చిత్తూరు, జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. దక్షిణ కోస్తాలో అనేక చోట్ల, ఉత్తర కోస్తాలో కొన్ని చోట్ల తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు నెల్లూరు, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో ఒకట్రెండు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవొచ్చని వివరించింది. తుపాను నేపథ్యంలో దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అధికార యంత్రాంగ అప్రమత్తమైంది. తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు, అన్నమ్మయ్య, కడప జిల్లాల అధికారులతో సీఎస్ జవహర్ రెడ్డి సమీక్షించారు. ప్రభావిత ప్రాంతాల్లో తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. తుపాను ప్రభావంతో కోస్తాలో తీరం వెంబడి గంటకు గరిష్టంగా 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని తుపాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. ఈ తుపానుకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సూచించిన "మాండూస్" అనే పేరు పెట్టనున్నారు. ఈనెల 15వ తేదీన అండమాన్ సముద్రం లేదా దక్షిణ బంగాళాఖాతంలో మరో అల్ప పీడనం ఏర్పడే అవకాశం ఉంది. దీని ప్రభావం 20వ తేదీ వరకు ఉండే అవకాశం ఉంది. మాండోస్ తుఫాను పేరు కొంచెం భిన్నంగా ఉన్నా భారీ ముప్పుగా మన రాష్ట్రానికి మారనుందని ఏపీ వెదర్ మ్యాన్ చెప్పారు. చెన్నైకి దగ్గరలో తీరం తాకే ఈ భారీ తుఫాను డిసెంబరు 10 న తీరాన్ని తాకి అదే రోజున తిరుపతి జిల్లా మీదుగా రాయలసీమ లోకి ప్రవేశిస్తుంది. దీని వలన తిరుపతి నగరంతోపాటుగా తిరుమల?, తిరుపతి జిల్లాలోని వివిధ భాగాలు, అన్నమయ్య జిల్లాలోని పలు భాగాలతో పాటుగా నెల్లూరు జిల్లాలో అక్కడక్కడ అతిభారీ వర్షాలను పడే అవకాశం ఉందట. ఒక పక్క గాలులు, మరోవైపు వర్షం. కాబట్టి డిసెంబరు 9 రాత్రి నుంచి 10 మధ్యాహ్నం వరకు వాతావరణం చాలా వైల్డ్‌గా ఉంటుందని చెబుతున్నారు. ఈ తుపాను పూర్తి ప్రతాపాన్ని ఆ సమయంలో చూడగలమన్నారు. ఇప్పుడు మాత్రం సినిమా మొదటనే ఉన్నాం కాబట్టి తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలను కొనసీమ?, పశ్చిమ గోదావరి, కృష్ణా, ప్రకాశం, బాపట్ల?, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో చూడగలమన్నారు. తెలంగాణలో మాత్రం వర్షసూచన లేదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

# సంపాదకీయం

శనివారం 10-12-2022

## ఈసీకి కొలీజియం వ్యవస్థ అవసరమేనా?

అతి పెద్ద ప్రజాస్వామిక వ్యవస్థ కలిగిన మన దేశంలో ఎన్నికలు నిర్వహించడానికి రాజ్యాంగబద్ధంగా, ఆర్టికల్ 324 ప్రకారం స్వతంత్ర ప్రతిపత్తి గల ఎన్నికల కమిషన్‌ను 1950లో ఏర్పాటు చేశారు. ఇది ఇప్పటివరకు 17 సార్లు లోక్‌సభ ఎన్నికలతో పాటు రాష్ట్రాల శాసనసభల ఎన్నికలను నిర్వహించింది. ఇప్పటి దాకా 25 మంది ప్రధాన ఎన్నికల కమిషనర్లుగా వ్యవహరించారు. 1989 వరకు ఎన్నికల కమిషనర్ ఒకరు మాత్రమే ఉండేవారు. ఆ తరువాత మరో ఇద్దరిని నియమించారు. ముగ్గురిలో ఒకరు ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు. 72 సంవత్సరాల భారత ఎన్నికల చరిత్రలో కమిషన్ మీదా, కమిషనర్ మీదా అనేక రకాల ఆరోపణలు వస్తున్నాయి. నిజానికి 80 కోట్ల ఓటర్లు ఉన్న మనదేశంలో ఎన్నికల నిర్వహణ తేలికైన విషయం కాదు. కమిషన్ ఎన్నికలను కఠినంగా నిర్వహించడానికి మరిన్ని సంస్కరణలు చేయాలనే భావన వ్యక్తం అవుతోంది. ముఖ్యంగా ఓటర్ల నమోదులో జరుగుతున్న అవతవకలు, పెరుగుతున్న ఖర్చు, ప్రలోభాలు, డబ్బు నియంత్రణ, అసాధ్యమైన హామీల విషయంలో సంస్కరణలు అత్యవసరం. ఎందుకంటే, ఇటీవల జరిగిన మునుగోడు ఎన్నికల సమయంలో డబ్బులు పంచుతున్న వీడియోలు బయటకు వచ్చాయి. ప్రచార మాధ్యమాల సాక్షిగా ప్రజలు కూడా వాటిని అంగీకరించారు. అయినా, చర్యలు చేపట్టలేని అచేతన స్థితిలో ఎన్నికల కమిషన్ ఉండిపోయిందనే భావన సామాన్య ప్రజలలో కలుగుతోంది. అందుకే సంస్కరణలు తీసుకోవడానికి కమిషనర్లు స్వతంత్రంగా పని చేయాలి. తరచూ జరుగుతున్న ఎన్నికల నిర్వహణ వలన ఆర్థిక భారం పడుతుంది కాబట్టి జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాలను సైతం ఎన్నికల కమిషన్ త్వరగా పరిశీలించాలి. ఎన్నికలను పారదర్శకంగా, నిబంధనల మేరకు నిర్వహించకుండా కేంద్రంలో అధికారంలో ఉండే పార్టీకి అనుకూలంగా వ్యవహరించే వారినే ఎన్నికల కమిషనర్లుగా నియమిస్తున్నారనే విమర్శలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషనర్లను నియమించడానికి ఒక స్వతంత్ర ప్రతిపత్తి గల వ్యవస్థను ఏర్పాటు చేయాలనే పిటిషన్ మీద జస్టిస్ కేఎం జోసెఫ్ ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యుల సుప్రీం ధర్మాసనం విచారణ జరుపుతున్నది. విచారణ జరుగుతుండగానే ఎన్నికల కమిషనర్‌గా అరుణ్ గోయల్ ను నియమించడం, ఎన్నికల కమిషనర్లుగా టీఎన్ శేషన్ వంటివారు రావాలని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేయడంతో మరోసారి ఎన్నికల కమిషనర్ల నియామకంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఆర్థిక సంఘం, ఎన్నికల కమిషన్, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ , అంతర్రాష్ట్ర మండలి, మహిళా కమిషన్, సుప్రీంకోర్టు వంటివి రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన సంస్థలు. ఇవి స్వయంప్రతిపత్తితో పని చేస్తేనే ఆయా సంస్థల గౌరవం పెరిగి సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలగదు. కానీ, అవి నిష్పక్షపాతంగా రాజ్యాంగం కల్పించిన అధికారంతో పనిచేయకుండా అధికార పార్టీ కనుసన్నలలోనే పనిచేస్తున్నాయనే ఆరోపణలు నిత్యం వింటూనే ఉన్నాం. ఇది దేశానికి ఎంతో ప్రమాదం. ఈ దేశంలో ఎన్నికల ద్వారానే ప్రభుత్వాలు ఏర్పడతాయి కాబట్టి ఈ కమిషన్ ఇలాంటి ఆరోపణలకు తావు ఇవ్వకుండా నిష్పక్షపాతంగా తన విధులు నిర్వర్తించాల్సిన ఆవశ్యకత ఉంది. ఎన్నికల సంస్కరణలు తీసుకురావడంలో పదవ ఎన్నికల కమిషనర్‌గా వ్యవహరించిన టీఎన్ శేషన్ ఒక ప్రత్యేకంగా వ్యవహరించారు. ఓటర్ ఐడీ కార్డ్ అమలుకు తెచ్చారు. అనుమతి లేకుండా గోడలపై రాతలు, మైకులు వాడటం, ఖర్చు పరిమితి, మత పరమైన ప్రదేశాలలో, విద్యాసంస్థలలో ఎన్నికల ప్రచారం నిషేధించారు. దీంతో కొంతమేరకు ప్రక్షాళన జరిగింది. ఆయన తరువాత ప్రధాన ఎన్నికల కమిషనర్లుగా వ్యవహరించిన ఎంఎస్ గిల్, జే ఎం లింగ్డో, టీఎస్ కృష్ణమూర్తి కూడా అమలు చేశారు. కానీ, అలాంటి వారు ఇప్పుడు లేరు. అందుకే సుప్రీంకోర్టు సైతం ఆయన పేరు తలచింది. ఈ మార్పులు, సంస్కరణలు తీసుకురావడానికి సుప్రీంకోర్టు భావిస్తున్నట్టు కమిషనర్ల ఎంపిక విధానంలో సంస్కరణలు తీసుకు రావాల్సిన అవసరం ఉంది. ప్రధానమంత్రితోఎన్నికల కమిషన్ తలపడే సందర్భం వస్తే ప్రధానిపై చర్యలు తీసుకోగలరా? అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అందుకే న్యాయవ్యవస్థకు కొలీజియం వ్యవస్థ ఉన్నట్టుగానే ఎన్నికల కమిషనర్‌ను నియమించడానికి ఒక స్వతంత్ర్య వ్యవస్థను ఏర్పాటు చేయాలనే భావం ఏర్పడుతుంది. అలా చేస్తేనే ఈసీ మీద వస్తున్న ఆరోపణలను నివారించడంతోపాటు ఆ వ్యవస్థ మరింత పారదర్శకంగా పనిచేసే అవకాశం కల్పించినట్టు అవుతుంది. మహాకవి ఆరుద్ర వ్యాఖ్యానించినట్టు 'దేశ రాజకీయాలు మేడిపండు లాంటివి. వాటి నుంచి మేలిమి ఆశించడం దురాశే' అవుతుందేమో!

## పంచాయితీల్లో ఇబ్బంది తప్పదు

విజయవాడ, డిసెంబర్ 9,రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల విషయంలో ప్రభుత్వం అంతర్గతంగా పలు సర్వేలు నిర్వహిస్తోంది. వాలంటీర్ల నుండి వస్తున్న సమాచా రంతోపాటు సొంత వ్యవస్థ ద్వారా ముఖ్యమంత్రి కార్యాలయం ఎప్పటికప్పుడు ప్రత్యేక నివేదికలు తెప్పించుకుంటోంది. ముఖ్యంగా సంక్షేమ పథకాలు అందుతున్న ప్రజల్లో సంతృప్తి ఎలా ఉందనే అంశంపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలిసింది. అలాగే ప్రజాప్రతినిధుల పనితీరుమీద ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుంటున్నట్లు సమాచారం. ఇటీవల నిర్వహించిన ఇంటింటికీ వైసిపి కార్యక్రమం లో పలుచోట్ల నిలదీతలు ఎదురవడంతో ప్రజా ప్రతినిధులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వచ్చింది. ఇలా ఎందుకు జరిగిందనే కోణంలోనూ ప్రభుత్వం, వైసిపి నాయకులు ఆలోచనలో పడ్డారు. ఈ క్రమం లో సంక్షేమ పథకాల అమలు తీరుపై అంతర్గతంగా సమాచారం సేకరించినట్లు తెలిసింది. ఎక్కువచోట్ల నుండి కొంత అనుకూలత ఉన్నప్పటికీ పెరిగిన భారాల వల్ల ప్రజల్లో కొంత అసంతృప్తి వ్యక్తమవుతు న్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. సంక్షేమ కార్యక్రమాల అమల్లో భాగంగా ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బు జమచేయడంతో స్థానిక ప్రజాప్రతినిధులతో ప్రత్యక్ష సంబంధాలు కొంత తగ్గాయి. గతంలో ఏ పథకం అమలు చేయాలన్నా నేరుగా ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు వెళ్లి పెద్దఎత్తున సభలు నిర్వహించి ప్రచారం చేసి వచ్చేవారు. ఇప్పుడు ముఖ్యమంత్రే నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు వేయడం వల్ల ఎమ్మెల్యేలతో పెద్దగా అవసరం లేకుండా పోయిందనే అభిప్రాయం ప్రజల్లో వెల్లడైనట్లు తెలిసింది. లబ్ధిపొందిన వారు ఓట్లు వేయకపోతారా అనే అబ్భిప్రాయంతో ప్రజా ప్రతినిధులూ ఉ న్నట్లు తెలిసింది. ఇది క్షేత్రస్థాయిలో పార్టీకి నష్టం కలిగించే అంశమని వైసిపి నేతలూ భావిస్తున్నారు. మరోవైపు పార్టీ నాయకుల మధ్య అంతర్గత విభేదాలు పెరిగా యి. జిల్లా స్థాయిలో జెడ్‌పి ఛైర్మన్లు, ఎమ్మెల్యేల మధ్య పలుచోట్ల ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇదే పరిస్థితి కొనసాగితే పార్టీకి ఇబ్బందేననే కోణంలో నాయకులు ప్రత్యేక కార్యాచరణకు రూపకల్పన చేస్తు న్నారు. త్వరలోనే దీనిపై స్పష్టమైన ప్రకటన రానుంది. ఈ నేపథ్యంలో అన్ని వర్గాల ప్రజలనూ కలుసుకునే విధంగా ప్రభుత్వం నిరంతర కార్యా చరణకు రూపకల్పన చేయనున్నట్లు సమాచా రం. సుమారు 50 ప్రధాన కార్పొరేషన్లకు సంబంధించి ఆయాకులాల వారీగా వేర్వేరు ప్రాంతాల్లో బహిరంగ సభలు నిర్వహించనున్నారు. దీనికోసం ప్రభుత్వం వైపు నుండి కులాల వారీగా బుక్‌లెట్లు ప్రచురిస్తున్న ట్లు తెలిసింది. ఇంటింటికీ వైసిపిలో పంచిన వివరాలు కాకుండా ఇక ముందు కార్పొరేషన్ల వారీగా సమాచారం తీసుకుని, వాటిని ఆయా కులాల సభల్లో పంచనున్నారు. ఈ కార్య క్రమాలన్నిటికీ సిఎం నేరుగా హాజరవ్వాలని నిర్ణయిం చుకున్నట్లు తెలిసింది. ముఖ్యమంత్రి స్థాయిలో ఆయా వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించడం, అదే వేదికపై ఎమ్మెల్యేలు, ఎంపిలకు ప్రాధాన్యత కల్పించడం ద్వారా ప్రజల్లో అక్కడక్కడా ఉన్న అసంతృప్తిని కూడా తగ్గించాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉంది. అనంతరం మరో విడత ప్రజా ప్రతినిధులందరూ ఇంటింటికీ వెళ్లే కార్యక్రమానికి రూపకల్పన చేయనున్నట్లు తెలిసింది. ముఖ్యంగా పంచాయతీ సర్పంచుల వ్యవహారమూ స్థానికంగా వైసిపికి ఇబ్బంది కలిగించే అంశంగా మారింది. వార్డు, గ్రామ సచివాలయాలతో స్థానికంగా సర్పంచులు, ఎంపిపిలకు విలువ లేకుండా పోయిందనే అభిప్రాయం రావడంతో దాన్ని కూడా సరిచేసే కోణంలో ప్రభుత్వం ఉంది.

## 2024 ఆర్మీని సిద్ధం చేస్తున్న జగన్



విజయవాడ, డిసెంబర్ 9, వైఎస్ జగన్ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. అన్ని రకాలుగా ప్రత్యర్థులను కట్టడి చేసే ప్రయత్నాలను ప్రారంభించారు. అభ్యర్థుల ఎంపికపై కూడా కసరత్తులు ప్రారంభించారు. ఎప్పటికప్పుడు సర్వేలు తెప్పించుకుంటూ ఎవరికి టిక్కెట్ ఇస్తే విజయం సాధ్యమవుతుందన్న దానిపై లెక్కలు వేసుకుంటున్నారు. ఇటు పీకే టీం నివేదికలు ఇస్తుండగా, జగన్ ఓన్ మీడియా నుంచి ఎప్పటికప్పుడు ఎమ్మెల్యేల పనితీరుపై రిపోర్టులు తెప్పించుకుంటూ ఎన్నికలకు సిద్ధమయ్యారని చెబుతున్నారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా పార్టీని బలోపేతం చేసే దిశగా చర్యలను కూడా ప్రారంభించారు. నాలుగు విమాన సర్వీసులు రద్దు గడప గడపకు అంటూ... సహజంగా ప్రతిపక్షాలు ముందుంటాయి. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను సొమ్ము చేసుకునేందుకు విపక్ష పార్టీలు ముందుగానే సిద్ధమవుతాయి. అధికార పార్టీలు ఎప్పుడూ నిదానంగా ఎన్నికల నిర్ణయాలు తీసుకుంటుంది. కానీ ఆంధ్రప్రదేశ్ లో మాత్రం వైసీపీ విపక్షాల కంటే ముందుగానే జగన్ రంగంలోకి దిగారు. ప్రతి ఎమ్మెల్యేకు గడప గడపకు ప్రభుత్వం అంటూ కార్యక్రమం ఇచ్చారు. దానిపై నెలవారీ సమీక్ష చేశారు. ప్రతి ఇంటికీ ఈ ప్రభుత్వం నుంచి అందిన లబ్దిని నేరుగా తెలియజేయడం, వారి సమస్యలను తెలుసుకోవడం వంటి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఐదు నెలల క్రితమే జగన్ ప్రారంభించారు. ఏదో ఒక కార్యక్రమాన్ని ప్రారంభించే కారణంతో జిల్లాల పర్యటనలకు కూడా జగన్ శ్రీకారం చుట్టారు. జిల్లాల నుంచే లబ్దిదారుల ఖాతాల్లో వివిధ పథకాల కింద నగదును బదిలీ చేస్తున్నారు. వీటిని కూడా ఎన్నికల ప్రచారం కార్యక్రమంగానే జగన్ ఉపయోగించుకుంటున్నారు. తమ ప్రభుత్వం చేసిన పనులను చెప్పడమే కాకుండా, విపక్షాలను తీవ్రస్థాయిలో విమర్శించడం ద్వారా మరోసారి వాతావరణాన్ని తనకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నంలో ఉన్నారు. అంతేకాకుండా వైసీపీ నేతలకు లక్ష్యాన్ని కూడా నిర్దేశించారు. 175కు 175 స్థానాల్లో గెలవాల్సిందేనని వైసీపీ నేతలకు జగన్ టార్గెట్ పెడుతున్నారు. అంటే 175 టార్గెట్ గా పెడితే కనీసం 150 స్థానాలయినా దక్కుతాయని జగన్ ఆలోచన కావచ్చు. తాజాగా జయహో బీసీ సదస్సు ను కూడా ఏర్పాటు చేశారు. దాదాపు 82 వేల మంది బీసీ ప్రజాప్రతినిధులను ఒక చోటకు చేర్చి వారికి దిశానిర్దేశం చేశారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలిస్తే రాజకీయ భవిష్యత్ ఉంటుందని వారిలో భరోసా నింపే ప్రయత్నం చేసినట్లే కనపడుతుంది. తాము బీసీలకు ఈ నాలుగేళ్లలో ఏం చేసింది? భవిష్యత్ లో ఏం చేయనున్నామన్న దానిపై ఆయన సవివరంగా తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జగన్ బీసీ సదస్సులో రెండు గంటల పాటు ప్రసంగించడాన్ని చూస్తుంటే ఈసారి బీసీ ఓటు బ్యాంకుపై ఆయన ఎక్కువ నమ్మకం పెట్టుకున్నారని చెప్పక తప్పదు. ఎంతమంది కలసి వచ్చినా తన వెంట నలుగురే ఉన్నారని చెబుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలేనని ఆయన పదే పదే చెప్పడం ఇందులో భాగమేనని అంటున్నారు.. పార్టీని మరింత బలోపేతం చేయడానికి జగన్ మరో అడుగు ముందుకేశారు. ఇప్పటికే వాలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులను ఎన్నికల విధుల నుంచి తప్పించేలా మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. వాలంటీర్లతో పాటు పార్టీ పరంగా కూడా ప్రతి యాభై ఇళ్లకు ఒక కార్యకర్తను నియమించుకునేలా చర్యలు తీసుకోబోతున్నారు. ఇందుకోసం ప్రత్యేక వ్యవస్థను రూపొందించనున్నారు. యాభై ఇళ్లకు సంబంధించి పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లి ఓటు వేయించాల్సిన బాధ్యత ఆ కార్యకర్త మీద ఉంచుతారు. వీరితో పాటు బూత్ లెవెల్ కమిటీలను కూడా తయారు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈరోజు పార్టీ జిల్లా అధ్యక్షులు, పార్టీ పరిశీలకులతో జగన్ సమావేశం నిర్వహిస్తున్నారు. మొత్తం మీద జగన్ ఇంకా ఎన్నికలు పద్దెనిమిది నెలలు ఉండగానే తన సైన్యాన్ని సిద్ధం చేస్తున్నట్లే కనపడుతుంది. అన్నింటా మొహరిస్తున్నట్లు అర్థమవుతుంది. మరి ప్రజలు చివరకు ఎవరిని ఆశీర్వదిస్తారో చెప్పలేం కాని జగన్ మాత్రం విపక్షాల కంటే ఒక అడుగు అన్నింటా ముందు ఉండేందుకే ప్రయత్నాలు ప్రారంభించారని చెప్పక తప్పదు.

## శేషాచలం అడవుల్లోని రెండు ప్రాంతాల్లో 32ఎర్రచందనం దుంగలు స్వాధీనం

తిరుపతి శేషాచలం అటవీ పరిధిలోని తలకోన సౌత్ ఫారెస్ట్, అలిపిరి ఫారెస్ట్ బీట్ పరిధిలలో 32ఎర్రచందనం దుంగలను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్సు ఎస్పీ కే.చక్రవర్తి ఆదేశాల మేరకు రిజర్వు ఇనస్పెక్టర్ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన రెండు టీమ్ లు శేషాచలం అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టాయి. ఆర్ఎస్ఐ లింగాధర్ టీమ్ బాకరాపేట రేంజి, నెరబైలు సెక్షన్ తలకోన సౌత్ ఫారెస్టులో కూంబింగ్ చేపట్టింది. వీరు యర్రావారిపాలెం మునెద్దుల మడుగు చేరుకునే సరికి అక్కడ కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారు. దీంతో వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా, దుంగలు పడేసి చీకట్లో పారిపోయారు. అక్కడ 21ఎర్రచందనం దుంగలు లభించాయి. అదే విధంగా ఆర్ఎస్ఐ విశ్వనాథ్ టీమ్ తిరుమల చేరుకుని, అక్కడ నుంచి తిరుపతి డౌన్ ఘాట్ రోడ్డు వైపు కూంబింగ్ చేపట్టారు. అలిపిరి ఫారెస్ట్ బీట్ పరిధిలోని తిమ్మినాయుడు పాలెం సెక్షన్ సన్నరాళ్ల మిట్ల ప్రాంతంలో కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారు. వీరు దూరం నుంచి టార్చ్ లైట్ వెలుగులు చూసి దుంగలు పడేసి పారిపోయారు. అక్కడ 11ఎర్రచందనం దుంగలు లభ్యమయ్యాయి. మొత్తం 32ఎర్రచందనం దుంగలను టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తీసుకుని వచ్చి కేసు నమోదు చేశారు. ఇవి 987కిలోలు ఉండగా, వీటి విలువ సుమారు రూ.50లక్షలు ఉంటుందని ఎస్పీ చక్రవర్తి తెలిపారు. పారిపోయిన వ్యక్తుల కోసం గాలింపులు చేపట్టినట్లు తెలిపారు.

## ఒడిశాలోని ఓ గ్రామంలో బుల్లెట్లు వర్షం: గాయాలపాలవుతున్న గ్రామస్థులు

ఒడిశా డిసెంబర్ 9 మనలో అందరికీ సాధారణ నీటి వర్షం గురించి తెలుసు. సీజనల్ వారీగా వర్షాలు కురుస్తూనే ఉంటాయి .ఇవి లేకపోతే.. మనకు పంటలు లేవు ఆహారం అంతకన్నా లేదు. సరే.. దీనికి మించి అంటే..చేపల వర్షం. ఆకాశం నుంచి చేపలు కురవడం. ఇది కూడా మనదేశంలోని మధ్యప్రదేశ్ రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో ఒక్కొక్క సీజన్లో కనిపిస్తుంది. ఆకాశం నుంచి చేపలుపడుతుంటాయి.ఇక కప్పల వర్షం. మనదగ్గర ఒకే ఒక్కసారి పశ్చిమ బెంగాల్లో కురిసింది. ఇక్కడకూడా కప్పలు జోరుగా ఆకాశం నుంచి రాలి పడుతున్నాయా? అన్నట్టుగా వర్షం కురిసింది. ఇది విదేశాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. సరే..ఈ రెండింటి గురించి కనీసం చెప్పుకొనైనా ఉన్నాం. కానీ చిత్రంగా.. ఒడిశాలోని ఓ గ్రామంలో బుల్లెట్ల వర్షం కురుస్తుండడం ఆశ్చర్యంగాను అనుమానంగాను ఉంది.ఒడిశాలోని ఓ గ్రామంలో బుల్లెట్లు వర్షం రూపంలో ప్రజలపై కి దూసుకొస్తున్నాయి. దీంతో గ్రామస్థులు తీవ్ర గాయాలపాలవుతున్నారు. గత మూడేళ్లుగా ఈ ఘటనలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.ఒడిసా లోని కటక్ జిల్లా నువాఘమ్ గ్రామంలో అప్పుడప్పుడు తూటాల వర్షం కురుస్తోందని ప్రజలు చెబుతున్నారు. అయితే పైనుంచి కురుస్తున్న ఈ బుల్లెట్లు ఎప్పుడు ఎక్కడ వర్షిస్తాయో తెలియక పోవడం గమనార్హం.నిజానికి శత్రుదేశాలకు పొరుగున ఉన్న కొన్ని గ్రామాల్లో ఇలా జరుగుతుంది. రాజస్థాన్ లో ఒకప్పుడు ఇలానే జరిగింది. దీని వెనుక పాకిస్థాన్ ముఠా ఉందని అప్పట్లో గుర్తించారు. కానీ ఒడిసా చుట్టుపక్కల ఎక్కడా కూడా శత్రుదేశం లేదు. కానీ ఇలా బుల్లెట్ల వర్షం మాత్రం కురుస్తుండడం గమనార్హం.అయితే ఈ ఘటనలపై తమకు ఎలాంటి సమాచారం లేదని జిల్లా కలెక్టర్ చెప్పడం విశేషం.

## విజయసాయిరెడ్డి పదవికి ట్వీట్ల గండం

విజయవాడ, డిసెంబర్ 9,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ విజయసాయిరెడ్డిని రాజ్యసభ ప్యానల్ వైస్ చైర్మన్ జాబితాలో మొదట చేర్చిన రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్ అనూహ్యగా తర్వాత తొలగించారు. రాజ్యసభ కార్యాలయం నుంచి ఆయనకు సమాచారం కూడా వచ్చింది. అలాగే రాజ్యసభ వెబ్‌సైట్‌లో ప్యానల్ వైస్ చైర్మన్ల జాబితాను పెట్టినప్పుడు ఎనిమిదో పేరుగా విజయసాయిరెడ్డిని ప్రస్తావించారు. కానీ రాజ్యసభలో అధికారిక ప్రకటన చేస్తున్న సమయంలో రాజ్యసభ చైర్మన్ , ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ మాత్రం.. ప్యానల్ వైఎస్ చైర్మన్ జాబితా పునర్వ్యవస్థీకరించామని చెప్పి ఏడు పేర్లే ప్రకటించారు. ఎనిమిదో పేరుగా ఉన్న విజయసాయిరెడ్డి పేరును ప్రస్తావించలేదు. దీంతో ఆయన పేరు తొలగించినట్లుగా స్పష్టమయింది. రాజ్యసభ చైర్మన్ ఆఫీసు నుంచి తనకు సమాచారం రావడంతో విజయసాయిరెడ్డి కూడా .. ఉ పరాష్ట్రపతికి కృతజ్ఞతలు చెబుతూ ట్వీట్ చేశారు. రాజ్యసభ చైర్మన్ ప్యానల్ వైస్ చైర్మన్ల జాబితా నుంచి తన పేరును తొలగించినట్లుగా స్పష్టత రావడంతో విజయసాయిరెడ్డి కూడా ఆ ట్వీట్‌ను డిలీట్ చేశారు. అయితే చివరి క్షణంలో విజయసాయిరెడ్డి పేరును రాజ్యసభ చైర్మన్ ఎందుకు తొలగించారన్నది మాత్రం సస్పెన్స్ గానే ఉంది. విజయసాయిరెడ్డి నియామకం గురించి బయటకు తెలిసిన తర్వాత ఆయన తీరుపై రాజ్యసభ చైర్మన్‌కు పలువురు ఫిర్యాదులు చేసినట్లుగా తెలుస్తోంది. ముఖ్యంగా వైఎస్ఆర్‌సీపీకే చెందిన రెబల్ ఎంపీ రఘురామకృష్ణరాజు విజయసాయిరెడ్డి తీరుపై ఫిర్యాదు చేశారని చెబుతున్నారు. విజయసాయిరెడ్డి సోషల్ మీడియాలో చాలా అభ్యంతరకంగా పోస్టులు పెడుతూ ఉంటారు. ఇతర పార్టీల నేతలు ప్రజాస్వామ్య బద్దంగా విమర్శించినా వారిని.. వారి కుటుంబాలను విమర్శిస్తూ పోస్టులు పెడుతూంటారు. ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడును ఉద్దేశించి .. ఆయన కుటుంబాన్ని ఉద్దేశించి విజయసాయిరెడ్డి పెట్టే పోస్టులు ఎన్నో సార్లు వివాదాస్పదమయ్యాయి. ఆయనకు ఏ మాత్రం గౌరవ మర్యాదలు లేవని.. అలాంటి వ్యక్తిని రాజ్యసభ చైర్మన్ చైర్‌లో కూర్చోబెడితే ఆ పదవికే అగౌరవం ఏర్పడుతుందని రఘురామకృష్ణరాజు ఫిర్యాదు చేశారని చెబుతున్నారు. విజయసాయిరెడ్డి చేసిన ట్వీట్లను.. ఇంగ్లిష్‌లోకి ట్రాన్స్ లేషన్ చేసి మరీ.. రాజ్యనభ చైర్మన్‌కు వంపారని అంటున్నారు. ఈ కారణంగా విజయసాయిరెడ్డికి లభించిన అరుదైన గౌరవం కొద్దిలో తప్పినట్లయిందని చెబుతున్నారు. సోషల్ మీడియాలో విజయసాయిరెడ్డి ట్వీట్లు చూసిన వారు.. బయట జెంటిల్మెన్‌లా కనిపించే ఆయన ఇంత అసభ్యకరంగా తోటి రాజకీయ నేతల్ని.. వారి కుటుబాల్ని వ్యక్తిగతంగా ఎలా దూషించగలరని ఆశ్చర్యపోతూంటారు. ఆయనను సోషల్ మీడియాలో ఇతర పార్టీల వాళ్లూ అంతే దారుణంగా ట్రోల్ చేస్తూంటారు. అయితే విజయసాయిరెడ్డి మాత్రం తన పంథాను వీడలేదు. ఇలాంటి ట్వీట్ల వల్ల పదవి పోయినా ఆయన బాధపడలేదన.. మళ్లీ మళ్లీ విపక్ష నేతలపై ఆయన పెడుతున్న పోస్టులతోనే అర్థం చేసుకోవచ్చంటున్నారు.

## కుప్పం కోటే టార్గెట్

తిరుపతి, డిసెంబర్ 9, ధ్రప్రదేశ్ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా ఏడాదిన్నర సమయం ఉంది. కానీ.. ఇంకో నెల రోజుల్లో ఎలక్షన్ ఉందన్నట్టు పార్టీలు వ్యవహరిస్తున్నాయి. బీజేపీ, జనసేన విషయం ఎలా ఉన్నా.. తెలుగుదేశం, వైఎస్సార్సీపీ మాత్రం ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామనే సంకేతాలు పంపుతున్నాయి. అటు వరుస సమావేశాలు నిర్వహిస్తూ జగన్.. ప్రజల్లో ఉ ంటూ చంద్రబాబు ఎన్నికలకు రెడీ అవుతున్నారు. ప్రజలను ఆకర్షించే నినాదాలు ఇస్తూ.. ఎలక్షనీరింగ్ మొదలుపెట్టారు. ఈ సమయంలో.. అధికార వైసీపీ కీలక నేత సజ్జల రామకృష్ణా రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చింతంగా 175 స్థానాల్లో విజయం సాధిస్తాం. వాటిలో ముందు కుప్పం నియోజకవర్గమే ఉంటుంది. కుప్పంలోనే గెలిచాక.. మిగతా నియోజకవర్గాల్లో ఏముంది. ఇన్నాళ్లు కుప్పం ప్రజలను చంద్రబాబు మోసం చేశారు. ఏదో చేస్తారని అక్కడి ప్రజలు ఆశపడ్డారు. కానీ చంద్రబాబుతో ఏమీ జరగబోదని ప్రజలకు అర్థం అయ్యింది. అందుకే ప్రజలు కూడా చంద్రబాబును ఓడించాలని డిసైడ్ అయ్యారు. అది స్థానిక సంస్థల ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది' అని సజ్జల రామకృష్ణా రెడ్డి వ్యాఖ్యానించారు. అటు తెలుగుదేశం పార్టీ కూడా కుప్పం, మంగళగిరి నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. చంద్రబాబు మళ్లీ కుప్పం నుంచే పోటీ చేయాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇటు లోకేశ్ కూడా మళ్లీ మంగళగిరి నియోజకవర్గంలోనే తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని భావిస్తున్నారట. అయితే.. చంద్రబాబును కుప్పంలోనే కాకుండా.. మరో నియోజకవర్గంలోనూ పోటీ చేయాలని కొందరు పార్టీ నేతలు కోరినట్టు ప్రచారం జరుగుతోంది. కుప్పంపై జగన్ ఫుల్ ఫోకస్ పెట్టడంతో.. రెండు నియోజకవర్గాల్లో పోటీ చేస్తే.. మేలు అనే అభిప్రాయాలు వ్యక్తమైనట్టు సమాచారం. చంద్రబాబు ఒప్పుకోలేదు అని తెలుస్తోంది. నిజంగానే కుప్పం సహా.. మరో నియోజకవర్గంలో పోటీ చేస్తే.. అధికార పార్టీకి భయపడినట్టు అవుతుందని.. తద్వారా.. పార్టీ నేతలు, కార్యకర్తలు డీలా పడతారని చంద్రబాబు అన్నట్టు సమాచారం. అందుకే.. పార్టీ తరఫున కేడర్‌ను సమాయత్తం చేసి.. స్థానిక సంస్థల ఎన్నికల్లో మాదిరిగా కాకుండా.. కచ్చితంగా గెలిచేలా పనిచేయాలని చంద్రబాబు సూచించినట్టు ప్రచారం జరుగుతోంది. అటు.. ఇతర నియోజకవర్గాల్లోనూ గెలుపు గుర్రాలకే అవకాశం ఇవ్వాలని చంద్రబాబు భావిస్తున్నట్టు తెలుగుదేశం నేతలు చెబుతున్నారు. దీంతో కుప్పంపై అందరి దృష్టి పడింది. అటు రెండు పార్టీలు మిషన్ కుప్పం అంటూ హీట్ పెంచుతున్నాయి.

## 15 రోజులు.. కోటి 50 లక్షల కుటుంబాలు...

రాజమండ్రి, డిసెంబర్ 9,ఏపీలో ఎన్నికలకు ఇంకా ఏడాదిన్నర సమయం ఉన్నా.. అన్ని ప్రధాన పార్టీలు ఎన్నికల జపం చేస్తున్నాయి. అయితే.. ఈ క్రమంలో ఏపీ సీఎం జగన్ వైసీపీ సమన్వయ కర్తలు, పార్టీ జిల్లా అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. పార్టీని బలోపేతం చేయాల్సిన అంశాలపై వారితో చర్చించారు. గడపగడపకు పార్టీని తీసుకెళ్లడంపై నేతలకు మాస్టర్ ప్లాన్ దిశానిర్దేశం చేశారు. గరిష్ఠంగా 15 రోజుల్లో 1.66 కోట్ల కుటుంబాలను కలుసుకునే విధంగా కార్యక్రమాన్ని రూపొందించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో వైసీపీ సైన్యాన్ని వ్యవస్థీకృతం చేయడమే ప్రధాన ఉద్దేశం అని తెలిపారు. 50 కుటుంబాల వారీగా మ్యాపింగ్ చేస్తున్నామని వెల్లడించారు. ప్రతి 50 ఇళ్లకు ఒక మహిళ, మరో వ్యక్తి గృహ సారథులుగా ఉంటారని వివరించారు. ఆ విధంగా 15 వేల గ్రామాల్లో 5.2 లక్షల మంది గృహసారథులు ఉంటారని సీఎం జగన్ పేర్కొన్నారు. అంతేకాకుండా, గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో పార్టీ తరఫున ముగ్గురు కన్వీనర్లు ఉంటారని, రాష్ట్రం మొత్తమ్మీద 45 వేల మంది కన్వీనర్లు ఉంటారని తెలిపారు. కన్వీనర్లను ఎంపిక చేసే బాధ్యత ఎమ్మెల్యేలు/నియోజకవర్గాల ఇన్చార్జిలకు అప్పగిస్తున్నామని వెల్లడించారు. వీరిపై నియోజకవర్గాల పరిశీలకుల పర్యవేక్షణ ఉంటుందని అన్నారు. ఎంపికైన వారు పార్టీ నుంచి వచ్చే సందేశాలను, పబ్లిసిటీ మెటీరియల్ ను గడపగడపకు చేరవేస్తారని సీఎం జగన్ వివరించారు.

## శాశ్వత భూ హక్కు రైతులకు వరం... ఆర్థర్

నందికొట్కూర్, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన భూముల రీసర్వేలో నాణ్యత అనేది చాలా ముఖ్యమని నందికొట్కూరు శాసనసభ్యులు ఆర్థర్ అన్నారు. ఒక గ్రామంలో రీసర్వే చేసిన తర్వాత అన్నిరకాలుగా ఈ ప్రక్రియను ముగుస్తుంది. ఆ గ్రామంలో మనదైన ముద్ర కనిపించాలని స్పష్టం చేశారు.వైయస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష పథకం. రీసర్వేలో నాణ్యత అనేది చాలా ముఖ్యమని స్పష్టం చేశారు. ఒక గ్రామంలో రీసర్వే చేసిన తర్వాత అన్నిరకాలుగా ఈ ప్రక్రియను ముగించాలన్నారు. ఆ గ్రామంలో మనదైన ముద్ర కనిపించాలన్నారు.జగనన్న శాశ్వత భూ హక్కు.. భూరక్ష పథకం.. జగనన్న శాశ్వత భూ హక్కు.. భూ రక్ష పథకం రైతులకు దేవుడిచ్చిన వరం లాంటిదని నందికొట్కూరు శాసనసభ్యులు తొగుర్ అర్థర్ అన్నారు..నందికోట్కూరు మండలం కొణిదెల గ్రామంలో, మన గౌరవ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న శాశ్వత భూహక్కు - భూ రక్ష పథకం కింద కొణిదేల గ్రామంలోని లబ్ధిదారులకు భూమి హక్కు పత్రములను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొంగర నవీన్, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ గంగిరెడ్డి రమాదేవి , ఎంపీపీ మురళి కృష్ణా రెడ్డి, వైస్ ఎంపీపీ పబ్బతి.జ్యోతి , నందికొట్కూరు మండల వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ సగినేల.ఉసేనయ్య , గ్రామ ఉపసర్పంచ్ భాస్కర్ రెడ్డి , ఎంపీటీసీ సురేష్, మాజీ సింగిల్ విండో చైర్మన్ శ్రీ చందమాల బాలస్వామి , మండల వైసీపీ నాయకులు ఉండవల్లి ధర్మారెడ్డి, మండల తహసిల్దార్ రాజశేఖర్ బాబు, మండల అభివృద్ధి అధికారి ఎం శోభా రాణి , డిప్యూటీ తహసిల్దార్ (ల్యాండ్ సర్వే) సత్యనారాయణ, ఈ ఓ ఆర్ డి శర్మ , ఇతర ప్రభుత్వ అధికారులు, కొణిదెల గ్రామరైతులు, వైయస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## పిసిసి అధ్యక్షుడు గిడుగు ను కలిసిన జిల్లా అధ్యక్షుడు నీలి

కడప శు క్రవారం విజయవాడలోని వేదిక కళ్యాణమండపంలో నూతనంగా పిసిసి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన గిడుగు రుద్రరాజుకు కాంగ్రెస్ కడప జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు అభినందన తెలియజేశారు.గిడుగు రుద్రరాజు నేతృత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కి మంచి భవిష్యత్తు ఉన్నదని, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి గా గిడుగు రుద్రరాజు పార్టీకిమంచిసేవలుఅందించారని,పిసిసి ప్రెసిడెంట్ గా ఆంధ్రప్రదేశ్ కు అదే విధంగా సేవలు అందిస్తారని ఆశిస్తున్నాను అన్నారు.ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ అయితేనే ఈ దేశానికి దశ దిశ చూపగలదని ప్రజలు భావిస్తున్నారని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టాల్సిన అవసరం ఉందని, గిడుగు రుద్దరాజు ఒక సమర్థవంత మైననాయకుడనిఅన్నారు.కార్యక్రమంలో కడప జిల్లా నేతలు పాల్గొన్నారు

## ఇంటింటా క్రిస్మస్ సంబరాలు

కడప నాడు బెత్లహేముపురం లోని పశువుల పాకలో జన్మించిన బాల యేసును దర్శింప వచ్చిన గొల్లలు, జ్ఞానులు లోక రక్షకుడైన బాల యేసును చూసి ఆనంద పరవశులై సంతోషంతో నృత్యాలు చేసిన విధంగా, ఆరోగ్యమాత విచారణ పరిధిలోని క్రైస్తవ కుటుంబాలకు బాల యేసు వారి గృహానికి వచ్చిన శుభ సందర్భంలో కుటుంబ సభ్యులు అంతులేని ఆనందముతో నృత్యాలు చేస్తూ ఒకరికొకరు క్రీస్తు జయంతి శుభాకాంక్షలు తెలుపుకుంటున్నారని, ఆరోగ్యమాత పుణ్యక్షేత్ర డైరెక్టర్ అబ్రహం తెలిపారు. క్రీస్తు జయంతి ముందస్తు వేడుకలు (క్రిస్మస్ క్యారేల్స్) పురస్కరించుకొని ఇందిరానగర్, మామిళ్ళపల్లి, మౌంట్ పోర్టు స్కూల్ లలో బాల యేసుతో వారి కుటుంబాలను దీవించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక రక్షకుడైన ఏసుక్రీస్తు జయంతి డిసెంబర్ 25 కోసం ప్రజలు విశ్వాసులు ఎదురుచూస్తూ ఉంటారని, డిసెంబర్ మొదటి నుంచే క్రీస్తు జయంతి ముందస్తు వేడుకలు నిర్వహిస్తూ ఉంటారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్యమాత అమ్మగార్లు మదర్ జనరల్ సెల్వి రాయప్పన్, మౌంట్ ఫోర్ట్ బ్రదర్ అమల్ రాజ్, శాంతి సేవా సొసైటీ ప్రెసిడెంట్ ప్రసాద్, జోసఫ్ కళ్యాణ్, రమేష్ గాయక బృందం పాల్గొన్నారు

## పోరాటాలతో నే రాయలసీమ అభివృద్ధి సాధ్యం

కడప అన్ని రంగాల్లో వెనకబడిన రాయలసీమ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే! పోరాటాలలోనే సాధ్యమని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ (ఆర్ సి పి) నగర కార్యదర్శి వర్గ సభ్యులు రమేష్, రవి అన్నారు.ఇందిరానగర్ లో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ 6వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు, ఈ సందర్భంగావారుమాట్లాడుతూ, ఒకనాడు రతనాలను రాశులుగా పోసిన నేలలో నేడు ఎడారితలపి స్తూ వలసలు, ఆత్మహత్యలు, నిరుద్యోగం, ఆకలి చావులు అధికంగా ఉండే ప్రాంతంగా రాయలసీమ ఉందని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే! పూర్వపు రోజులు మళ్లీ రావాలంటే! అది పోరాటాలతోనే సాధ్యమని రాయలసీమలోని ప్రతివారు రాయలసీమ అభివృద్ధి కోసం పోరాటం చేయాల్సిన రోజు అసన్నమైనదని వారు తెలియజేశారు.రాయలసీమలో అన్ని వనరులు ఉన్నప్పటికీ పాలకుల నిర్లక్ష్యనికి ఈ ప్రాంత ప్రజలు బలవుతున్నారని, ఉపాధిని సమృద్ధిగా నెలకొల్పి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వారి డిమాండ్ చేశారు. యుద్ధ ప్రాతిపాదికన కడప ఉక్కు పరిశ్రమను, పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులను, పరిశ్రమలను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చింతకొమ్మదిన్నె మండలం కార్యదర్శి మడగలం ప్రసాద్, షెడ్రక్, నరసింహులు, రమణ, పార్టీ సభ్యులు పాల్గొన్నారు

## రాజ్ భవన్ లో ఫ్లాగ్ డే

విజయవాడ విజయవాడ లోని రాజ్ భవన్ లో త్రివిధ దళాల ఫ్లాగ్ డే కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ విశ్వభూషన్ హరిచందన్, హోంమంత్రి తానేటి వనిత, హోం ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్ కుమార్ గుప్తా, కలెక్టర్లు ప్రశాంతి, దిల్లీ రావు, జేసీ లు, ఇతర సైనిక అధికారులు పాల్గొన్నారు. త్రివిధ దళాల్లో పనిచేసే సైనికులు, వారి కుటుంబసభ్యుల సంక్షేమం కోసం ప్రతి ఏటా డిసెంబర్ లో ఆర్మ్డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే ను నిర్వహించడం జరుగుతోంది. ఈ సందర్భంగా యుద్ధంలో గాయపడిన సైనికులకు, వీరమరణం పొందిన సైనికుల కుటుంబసభ్యులకు గవర్నర్ ఉస్వభూషన్, హోంమంత్రి తానేటి వనిత అవార్డులను, నగదు ప్రోత్సహకాలను అందించారు. ఈ సందర్భంగా హోంమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ... త్రివిధ దళాల ఫ్లాగ్ డే కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. భారత సరిహద్దులో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పని చేస్తున్న సైనికుల సేవలను వెలకట్టలేమని హోంమంత్రి పేర్కొన్నారు.

# సాధనతో ఏదైనా సాధ్యమే

ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి





కడప ప్రతి విద్యార్థినీ వేధించే సమస్య ధారణ అని, గుర్తుండని అంశాలను విద్యార్థులు పలుమార్లు రాస్తూ ఏకాగ్రతతో సాధన చేయాలని, అలా సాధన చేస్తే ధారణాశక్తి పెరుగుతుందని యోగి వేమన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం 'తెలుగు సూర్యుడు' సి.పి.బ్రౌన్ 139వ వర్ధంతిని (డిసెంబర్ 12) పురస్కరించుకొని ఈ నెల 6 నుండి 12వ తేదీ వరకు బ్రౌన్ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నది. అందులో భాగంగా నాల్గవరోజు శుక్రవారం ఉదయం 8,9,10 తరగతుల విద్యార్థులకు హిందూ, ఇస్లాం, క్రైస్తవ గ్రంథాలలోని విషయాల గురించి 'ధారణ పరీక్ష'ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ పట్టుదల, ఆత్మవిశ్వాసం ఉంటే ధారణ ఎలా సాధ్యపడుతుందో ఉదాహరణ పూర్వకంగా తెలియజేశారు. ప్రస్తుతం ప్రధానమంత్రి కార్యాలయంలో పనిచేస్తున్న ఒక మహిళా అధికారి ఒక కుగ్రామంలో పుట్టి అందరి విద్యార్థుల్లాగానే గుర్తు పెట్టుకోవడంలో చాలా ఇబ్బంది పడిరదని, తండ్రి ప్రోత్సాహంతో, సాధనతో జ్ఞాపకశక్తిని వృద్ధి చేసుకొని నేడు ఉన్నతస్థాయిలో ఉన్న విషయాన్ని తెలిపి విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. సభాధ్యక్షులు, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం బాధ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ హిందూ, ఇస్లాం, క్రైస్తవ గ్రంథాలలో సమకాలీన సమాజానికి ఉపయోగపడే అనేక అంశాలు ఉన్నాయని, విద్యార్థులు వాటి పైన అవగాహన కలిగి ఉండడం అవసరమన్నారు. ధారణ అనేది విద్యార్థి మేథాశక్తి స్థాయిని నిర్ణయిస్తుందని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకునే ఈ పోటీని నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. వైయస్సార్ కడప జిల్లాకు చెందిన లక్కోజు సంజీవరాయ శర్మ పుట్టుకతో అంధుడైనా ధారణాశక్తితో గణితావధానిగా దేశమంతటా కొనియాడబ డ్డారన్నారు. విశిష్ట అతిథి, నాబార్డ్ మేనేజర్ డి.విజయ విహారి మాట్లాడుతూ తినే ఆహారాన్ని బట్టి కూడా ధారణాశక్తి వృద్ధి పొందుతుందని, కాబట్టి విద్యార్థులు సాధ్యమైనంత మేరకు ఇంట్లో వండిన పదార్థాలను తినాలని సూచించారు. టివిలు, సినిమాలు అతిగా చూడడం వల్ల ధారణాశక్తి తగ్గుతుందని, సెల్‌ఫోన్లు విపరీతంగా వాడడం వల్ల సాటి మనుషులతో కమ్యూనికేషన్ లేకుండా పోతుందని తెలిపారు. మరో విశిష్ట అతిథి, సర్వశిక్షాభియా న్ ప్రాజెక్టు ఆఫీసర్ అంబవరం ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా ఆటలు బాగా ఆడుకోవాలని, దాని వల్ల శరీర ఆరోగ్యంతో పాటు ఉత్సాహం పెంపొంది అనేక విషయాలను అవగాహన చేసుకోగలుగుతార న్నారు. కష్టంగా కాకుండా ఇష్టంగా చదివితే ఏదైనా గుర్తుంటుంద న్నారు. గౌరవ అతిథి, విశ్వవిద్యాలయం జియాలజీ విభాగం అధ్యాపకులు ఆచార్య కె.రఘుబాబు మాట్లాడుతూ విద్యార్థులు చదివే విషయాన్ని ఊహాశక్తితో దృశ్యరూపంలో ఒక ఉదాహరణతో భావనచేస్తే ఆ విషయం సులభంగా అర్థం కావడంతోపాటు బాగా గుర్తుంటుందన్నారు. మరో గౌరవ అతిథి, విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా ఆర్.వి.జయంత్ కశ్యప్ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్ళడం అలవాటు చేసుకొని, అక్కడి అనేక పుస్తకాలను చదవాలని, అప్పుడే వ్యక్తిత్వం రాటుతేలుతుందన్నారు. అంధుడైన ప్రసిద్ధ ఆంగ్లకవి జాన్ మిల్టన్ ధారణాశక్తిని, చిన్నవయసులోనే మరణించిన ప్రసిద్ధ ఆంగ్లకవయిత్రి తోరుదత్ ధారణాశక్తిని సోదాహరణంగా వివరించారు. మరో గౌరవ అతిథి, విశ్వవిద్యాలయం మెటీరియల్ సైన్స్ మరియు నానో టెక్నాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా బి.విజయకుమార్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు ధారణ చాలా ముఖ్యమైందని, ప్రతి అంశంలోనూ ధారణను జీవితంలో అన్వయించుకోవాలన్నారు. విద్యతోపాటు తల్లిదండ్రులను, గురువులను గౌరవించడం వంటి మంచి లక్షణాలు అలవరచుకు న్నప్పుడే జీవితంలో రాణించగలు గుతారన్నారు. అనంతరం 8,9,10 తరగతుల విద్యార్థులకు హిందూ, ఇస్లాం, క్రైస్తవ గ్రంథాలలోని విషయాల గురించి 'ధారణ పరీక్ష' నిర్వహింపబడిరది. ధారణ పరీక్షకు న్యాయనిర్ణేతలుగా సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, గ్రంథపాలకులు ఎన్.రమేశ్‌రావు, జి.హరిభూషణరావు వ్యవహరించారు

# మంగళగిరిలో ఆరోగ్య శ్రీ సేవలు

గుంటూరు, డిసెంబర్ 9, (న్యూస్ పల్స్)మంగళగిరి ఎయిమ్స్‌లో ఇకపై ఆరోగ్య శ్రీ సేవలు అందనున్నాయి. అందరికీ ఉచిత వైద్యం అందించాలన్న సంకల్పంలో భాగంగా ఎయిమ్స్‌లో ఏపీ ప్రభుత్వం ఒప్పందం పెట్టుకుంది. ఇప్పటికే ట్రయల్ రన్‌లో భాగంగా వందల మందికి ఉచితంగా చికిత్స అందించారు. మంగళగిరి ఎయిమ్స్‌లో పేదలందరికీ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. ఎయిమ్స్ - రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఆరోగ్యశ్రీ విషయమై అవగాహన ఒప్పందం జరిగింది. ఇరు పక్షాలు ఎంవోయూ పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ... పేదలందరికీ ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించాలనే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆలోచనల మేరకు ఎయిమ్స్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు. కొద్ది రోజులుగా ఎయిమ్స్‌లో ఆరోగ్యశ్రీ ట్రయల్ రన్‌ను చేపట్టామని చెప్పారు. ఇప్పటికే 100 మందికిపైగా రోగులకు ఎయిమ్స్‌లో ఉచితంగా ఆరోగ్యశ్రీ సేవలు అందించామని తెలిపారు. 30 మందికిపైగా చికిత్స చేయించుకుని ఇంటికి కూడా చేరుకున్నారని వివరించారు. ఇప్పుడు అధికారికంగా ఇరు పక్షాల మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామని పేర్కొన్నారు. ఎయిమ్స్‌లో ఆరోగ్యశ్రీ లబ్ధిదారులందరికీ పూర్తి ఉచితంగా వైద్య సేవలు అందుతాయని చెప్పారు. దీనివల్ల పేదలకు వైద్య సేవలు మరింత నాణ్యంగా పూర్తి ఉచితంగా అందుతాయని పేర్కన్నారు. ప్రతి ఒక్కరికి వైద్యం అందించటమే జగన్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఎయిమ్స్‌లో అతి త్వరలో పెట్ సిటీ స్కాన్‌ను ప్రారంభించబోతున్నామని మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. శరీరంలో ఎక్కడ క్యాన్సర్ అవశేషాలు ఉన్నా సరే ఈ స్కాన్ ద్వారా పసిగట్టేయొచ్చని తెలిపారు. క్యాన్సర్‌కు అంతర్జాతీయ స్థాయి వైద్యం ఏపీలోనే అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఎయిమ్స్ కు ఇప్పుడు రోజుకు ఆరు లక్షల లీటర్ల నీటిని అందిస్తున్నామన్నారు. మంగళగిరి- తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్, విజయవాడ కార్పొరేషన్ల నుంచి మూడేసి లక్షల లీటర్ల చొప్పున మొత్తం ఆరు లక్షల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నామని వివరించారు. దీనివల్ల ఎయిమ్స్ లో పూర్తి బెడ్ సామర్థ్యం మేర వైద్య సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. వచ్చే జూన్ కల్లా పైపు లైను పనులు కూడా పూర్తవుతాయని చెప్పారు. ఇదిమంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం అని వెల్లడించారు. ఆరోగ్యశ్రీ సేవలు ఎయిమ్స్ లో 24 గంటలూ అందించాలని, అందుకోసం అదనంగా ఆరోగ్యమిత్రలను కూడా నియమించుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎయిమ్స్ నుంచి రోగులను మంగళగిరికి చేర్చేందుకు ఉచిత వాహన సౌకర్యం కల్పించాలని సూచించారు.స్పందించిన అధికారులు వెంటనే ఉచిత వాహనాన్ని ఏర్పాటుచేస్తామని తెలిపారు.ఇందుకు అవసరం అయితే దాతల సహకారం తీసుకోవాలని మంత్రి సూచించారు.ప్రభుత్వం పేదలకు వైద్యం అందించేందుకు చేస్తున్న పనులను అవవసరంగా రాజకీయం చేయవద్దని మంత్రి రజని హితవు పలికారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఎయిమ్స్ ను పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావటమే ప్రధాన ఉద్దేశమని ఇందులో రాజకీయ కోణం చూడటం సమంజనం కాదని తెలిపారు.

# వారాహిపై కామెంట్స్... నాదెండ్ల కౌంటర్

విశాఖపట్టణం, డిసెంబర్ 9, (న్యూస్ పల్స్)పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచార రథమైన 'వారాహి' వాహనంపై వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు జనసేన పార్టీ నేత నాదెండ్ల మనోహర్. ప్రభుత్వ కార్యాయాలకు పార్టీ రంగులు వేసి.. హైకోర్టుతో మొట్టికాయలు తిన్న వారు కూడా జనసేన పార్టీ వారాహి వాహనం రంగు గురించి మాట్లాడటం, నిబంధనల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఐటీ విభాగం ప్రతినిధులతో జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆయన.. వైసీపీ నేతలపై విమర్శలు గుప్పించారు. 'వారాహి' వాహనం నిబంధనలకు అనుగుణంగా సిద్ధం అవుతోందన్నారు. నిబంధనలు పరిశీలించకుండా రవాణా శాఖ వారు అనుమతి ఎలా ఇస్తారు? అని ప్రశ్నించారు. ఏ మాత్రం ఆలోచన లేకుండా విమర్శలు చేయడం.. వైసీపీ నాయకుల బుద్ధిరాహిత్యాన్ని, మూర్ఖత్వాన్ని తెలుపుతోందన్నారు.ప్రభుత్వ కార్యాలయాలకు ఇష్టానుసారం పార్టీ రంగులు వేసుకునే వారికి నిబంధనలు ఏం తెలుస్తాయని విమర్శించారు నాదెండ్ల. జనసేన పార్టీ ఎల్లప్పుడు నిబంధనల ప్రకారం మాత్రమే నడుచుకుంటుందని, పవన్ కళ్యాణ్ చేపట్టే ప్రతి కార్యక్రమం ప్రజాహితంగా, చట్టానికి లోబడి ఉంటుందని స్పష్టం చేశారాయన. వైసీపీ నాయకులకు వ్యక్తిగత విమర్శలు చేయటం అలవాటుగా మారిపోయిందని విమర్శించారు. అలాంటి వారికి పవన్ కళ్యాణ్ ఒక్కసారి చెప్పు చూపిస్తే భయపడ్డారని, అది నిజాయితీకి ఉన్న దమ్ము అని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ రాష్ట్ర పర్యటన రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తుందన్నారు. రాష్ట్రంలో ఏపీఎస్ఆర్టీసీ కాస్త వైస్సార్సీపీ ఆర్టీసీగా మారిపోయిందని విమర్శించారు నాదెండ్ల. పార్టీ కార్యక్రమాలకు ప్రభుత్వ బస్సులు వాడుకోవడం సిగ్గుచేటన్నారు. నిబంధనలు పట్టించుకోని వారికి.. నిబంధనల గురించి చెప్పే అర్హత ఉందా? అని ప్రశ్నించారు. వైసిపి నేతలు అధికారులపై ఒత్తిడి తెచ్చి ప్రకటన ఇప్పిస్తున్నారని ఫైర్ అయ్యారు నాదెండ్ల.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజనపై ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల చేసిన వ్యాఖ్యలు చిత్తశుద్ధి లేనివన్నారు జనసేన నేత నాదెండ్ల మనోహర్. అప్పుడు తెలంగాణ ప్రజల సెంటిమెంట్‌ను గౌరవిస్తామన్నారని గుర్తు చేసిన ఆయన.. ఇప్పుడు రెండు రాష్ట్రాల ప్రజలను మోసం చేస్తున్నారని ఫైరయ్యారు. వైసీపీ నేతలు రెండు రాష్ట్రాల ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు నాదెండ్ల మనోహర్.

## పెదవేగి పిహెచ్సి ని పరిశీలించిన ఎంపిడీవో

ఏలూరు ఏలూరుజిల్లా పెదవేగి మండలం లో ప్రజల ఆరోగ్య పరిస్థితులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి గంజి రాజ్ మనోజ్, మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాది కారుల తో కొద్దీ సేపు సమావేశమై ప్రజల ఆరోగ్య పరిస్థితులను అడిగితెలుసుకున్నారు.శుక్రవారం ఎంపి డి ఓ, పి హెచ్ సి ని సందర్శించారు. గ్రామాలలో డెంగ్యూ మలేరియా.టైపాయిడ్. వంటి వైరల్ ఫీవర్స్ ఉన్నాయా అని వైద్యాధికారులు డాక్టర్.పూర్ణిమ.డాక్టర్ మాధవి .సి హెచ్ ఓ రోజ్ మెరిలను ఆరా తీశారు.శీతాకాలం లో వాతావరణ పరిస్థితులు చిన్నపిల్లలకు.వృద్దుల ఆరోగ్యానికి సహరించవని అన్నారు.నవంబర్ డిసంబర్.జనవరి మాసాలలో చిన్నపిల్లలకున్యుమోనియా వ్యా దులు సోకె ప్రమాదముందన్నారు.వృద్దులకు ఊపిటీత్తుల సంబంధ వ్యాధులు వచ్చే ప్రమాదమునన్నారు.అటువంటి వ్యాధుల పట్ల వైద్యాధికారులు ఎప్పటికప్పుడు అప్రమాతగా ఉండాలని సూచించారు.ఆసుపత్రిలో రోగులకు మరుగుదొడ్డి సౌకర్యం కల్పించాలని చెప్పారు. ఆసుపత్రి .ముఖద్వారం వైపు ప్రహరీ నిర్మించాల్సిన అవసరముందన్నారు.

## శేషాచలం అడవుల్లోని రెండు ప్రాంతాల్లో 32ఎర్రచందనం దుంగలు స్వాధీనం



తిరుచానూరు..శేషాచలం అటవీ పరిధిలోని తలకోన సౌత్ ఫారెస్ట్, అలిపిరి ఫారెస్ట్ బీట్ పరిధిలలో 32ఎర్రచందనం దుంగలను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్సు ఎస్పీ కే.చక్రవర్తి ఆదేశాల మేరకు రిజర్వు ఇనస్పెక్టర్ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన రెండు టీమ్ లు గురువారం శేషాచలం అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టాయి. ఆర్ఎస్ఐ లింగాధర్ టీమ్ బాకరాపేట రేంజి, నెరబైలు సెక్షన్ తలకోన సౌత్ ఫారెస్టులో కూంబింగ్ చేపట్టింది. వీరు యర్రావారిపాలెం మునెద్దుల మడుగు చేరుకునే సరికి అక్కడ కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారు. దీంతో వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయుగా, దుంగలు పడేసి చీకట్లో పారిపోయారు. అక్కడ 21ఎర్రచందనం దుంగలు లభించాయి. అదే విధంగా ఆర్ఎస్ఐ విశ్వనాథ్ టీమ్ తిరుమల చేరుకుని, అక్కడ నుంచి తిరుపతి డౌన్ ఘాట్ రోడ్డు వైపు కూంబింగ్ చేపట్టారు. అలిపిరి ఫారెస్ట్ బీట్ పరిధిలోని తిమ్మినాయుడు పాలెం సెక్షన్ సన్నరాళ్ల మిట్ల ప్రాంతంలో కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారు. వీరు దూరం నుంచి టార్చ్ లైట్ వెలుగులు చూసి దుంగలు పడేసి పారిపోయారు. అక్కడ 11ఎర్రచందనం దుంగలు లభ్యమయ్యాయి. మొత్తం 32ఎర్రచందనం దుంగలను టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తీసుకుని వచ్చి కేసు నమోదు చేశారు. ఇవి 987కిలోలు ఉండగా, వీటి విలువ సుమారు రూ.50లక్షలు ఉంటుందని ఎస్పీ చక్రవర్తి తెలిపారు. పారిపోయిన వ్యక్తుల కోసం గాలింపులు చేపట్టినట్లు తెలిపారు.

## ఉక్కు పరిశ్రమ నిర్మించి సీ.ఎం. కు చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ



కడప డిసెంబర్ 09 జమ్మలమడుగు పరిధిలోని కన్యతీర్థం వద్ద ఉన్న కడప ఉక్కు పరిశ్రమ శంకుస్థాపన ఫలకం వద్ద పెట్టిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ ఐదు రోజుల పాదయాత్ర ప్రారంభం సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్), సిపిఎం కడప జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ... సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి చేపట్టిన జమ్మలమడుగు నుండి కడప కలెక్టరేట్ వరకు పాదయాత్రలకు సిపిఎం కడప జిల్లా కమిటీ, రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నదని వారు తెలిపారు. ఈనెల 12వ తేదీ మైదుకూరు నుండి చెన్నూరు వరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తో కలిసి కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం కై పాదయాత్రలో పాల్గొననున్నారని వారు తెలిపారు. ప్రజలను గడ్డిపోచల్లాగా చూస్తూ, ప్రజలు ఉమ్మడి సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న దేశ ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రి నియంతృత్వ పోకడలు కూలిపోవడానికి ఐదు నిమిషాలకు ముందు వరకు కూడా శక్తివంతంగానే కనపడతాయని వారు గుర్తించాలని వారు హెచ్చరించారు. వామపక్షాల గొంతుకను నొక్కే ప్రయత్నం వైసీపీ చేస్తోందని అది వారి వల్ల సాధ్యం కాదని వారి హెచ్చరించారు. కడప ఉక్కు పరిశ్రమ శంకుస్థాపన శిలాఫలకం వేసి మూడు సంవత్సరాలు గడిచిపోయిందని ఇప్పటివరకు పునాదిరాయి తప్ప పురోగతి లేదన్నారు. 2014 విభజన చట్టంలోని కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం కడప జిల్లాలో ఫీజిబిలిటీ ఉందని చెప్పిన శివరామకృష్ణయ్య కమిషన్ ఆనాటి ప్రతిపక్షంలో ఉన్న బిజెపి కేంద్ర పార్లమెంటులో చట్టాన్ని సమర్థించిన అధికారంలోకి వచ్చినాక బిజెపి సీల్ను ప్రభావితం చేసి నాట్ ఫిజిబులిటీ అని రిపోర్టు ఇప్పించిందని శైలు బృందాన్ని కేంద్రంలోని నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వమే తప్పుదారి వారు ఆరోపించారు. కడప జిల్లా ప్రజలు వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తేనే కడప జిల్లాలో కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం జరుగుతుందని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇక్కడ మాట్లాడుతున్న ప్రతిపక్ష నాయకుల మాటలు వైసీపీ గుండెల్లో గూగుల్ పుట్టిస్తున్నాయని వారు తెలిపారు

## ఈనెల 11న జేడి ఫౌండేషన్ రాత పరీక్షలు

విశాఖపట్నం ఆంధ్రప్రదేశ్లో తాజాగా 6100 పోలీస్ కానిస్టేబుల్, 411 ఎస్సై ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదలైం ది.ఈ క్రమంలో అభ్యర్థులకు ఉచితం గా శిక్షణ ఇచ్చేందుకు జేడీ ఫౌండేషన్ ముందుకొచ్చింది.స్ట్రీనింగ్ టెస్ట్ ను డిసెంబరు 11వ తేదీన ఉదయం 9 గంటల 30 నిముషాలకు రెండు తెలు గు రాష్ట్రాల్లోని దాదాపు 38 పరీక్ష కేంద్రాల్లో రాత పరీక్ష నిర్వహిస్తామని, వీటిల్లో దాదాపు 21 పరీక్ష కేంద్రాలు ఏపీలోనే ఉంటాయని,ఆసక్తి కలిగిన అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన మొదటి వెయ్యి మంది అభ్యర్థు లకు జేడీ ఫౌండేషన్ ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు విశాఖలో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ ప్రకటిం చారు.ఉత్తరాంధ్రలో కూడా పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఈ సందర్భంగా జేడీ తెలిపారు

# మన పరిసరాలను పరిశుభ్రతగా ఉంచుకుందాం.. పి కిషోర్ బాబు





నందికొట్కూరు,డిసెంబర్ 9 మనమందరము మన ఇంటి పరిసరాలు మన ఇంటి ఆవరణ మొత్తము మరియు నందికొట్కూర్ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకుందామని నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్ పీ కిషోర్ బాబు శుక్రవారం నాడు ప్రత్యేక సమావేశంలో ఈ సందర్భంగా వివరించారు. నీరు పారిశుధ్యం మరియు పరిశుభ్రతపై నగర కమిషనర్ ఆధ్వర్యంలో సొసైటీ ఫర్ రూరల్ అండ్ ఎకో డెవలప్మెంట్ వారి ఆర్థిక సహాయంతో శుక్రవారం నందికొట్కూరు షాపూర్ ఫంక్షన్ హాల్ నందు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా నగర కమిషనర్ పి కిషోర్ బాబు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ న్యాస్ రసూల్, ఏ ఎఈ భాను ప్రతాప్, మున్సిపల్ కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది, మేప్మా సిబ్బంది, సార్డ్ రిసోర్స్ పర్సన్స్ రజిత, స్లైడ్ అధ్యక్షులు దామోదర్ రెడ్డి, సిబ్బంది హాజరయ్యారు, కమిషనర్ పి కిషోర్ బాబు మాట్లాడుతూ పారిశుద్ధం పరిశుభ్రత మొదలగు అంశాలపై అవగాహన కలిగిన కలిగించారు. రిసోర్స్ పర్సన్ రజిత మాట్లాడుతూ బాల్యంలో సంభవించే వ్యాధులతో దాదాపుగా 50%(923) వ్యాధులు ప్రత్యక్షంగానూ లేక పరోక్షంగాను పరిశుభ్రం లేని త్రాగునీరు అపరిశుభ్రత బహిరంగ మల విసర్జన లాంటి వాటి వల్ల వస్తాయని పరిశోధనలు తెలియజేస్తున్నారు అన్నారు. పిల్లల మరణాలతో దాదాపు 90% డయేరియా (అతిసారం) వలన సంభవిస్తుందని పరిశుద్ధం లేకపోవడం వలన అనేక అనారోగ్యాలకు బారిన పడాల్సిందే వస్తుందని ఈ సందర్భంగా వీరందరూ అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు.

# భూముల దందాలు వివాదాలు



**కబ్జాల నిలయంగా మారిన ప్రభుత్వ స్థలాలు వదలని కబ్జాదారులు**

**నకిలీ ఇంటి పట్టాలు అనుబంధ పత్రాలతో హల్చల్**

**నకిలీ పట్టాలు అనుబంధాలకు విఆర్ఓ సుధాకర్ అండదండవిఆర్ఓ సుధాకర్ ప్రమేయంతోనే నకిలీ ఇంటి పట్టాలు అనుబంధ పత్రాల తయారీఅతని వ్యవహారంపై ఆర్డీవో ప్రత్యేక దృష్టి పెట్టాలిబాధితుల వేడుకలు**

బద్వేలు , బద్వేల్ లో ప్రభుత్వ భూముల కబ్జాలు తారా స్థాయికి చేరుకుంటున్నాయి బద్వేల్ పట్టణం బద్వేలు గోపవరం మండలాల జంట కలయిక ఈ రెండు మండలాల్లో ప్రభుత్వ భూములే ఎక్కువ గత మూడు సంవత్సరాలుగా భూములు కబ్జాలు మితిమీరి పోతున్నాయి అడిగేవారు లేకపోవడంతో కొందరు రెవిన్యూ సిబ్బంది కూడా ఈ విషయంలో కీలక పాత్ర పోషిస్తున్నారు రెండు మండలాల తాసిల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న కొందరు వీఆర్వోలు వీఆర్ఏలు పంచాయతీ కార్యదర్శులు ఈ విషయంలోప్రభుత్వ భూములు స్థలాలు ఆక్రమించే కత్యాదారులకు అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నారు బద్వేల్ మండలం తీరువెంగలాపురం పంచాయతీ విఆర్ఓ సుధాకర్ భూ కబ్జాదారులకు అన్ని విధాల సహకారం అందిస్తున్నాడు అంతేకాక నకిలీ ఇంటి పట్టాలు నకిలీ అనుబంధ పత్రాల విషయంలో అతను కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిసింది ఒకప్పుడు అతను బద్వేల్ మండలంలో కీలకమైన చెన్నంపల్లి పంచాయతీకి విఆర్ఓగా ఉండేవాడు అప్పట్లో భూముల కబ్జాదారులకు అన్ని విధాలుగా సహకారం అందించి లక్షల రూపాయలు వెనుకేసుకున్నాడు అంతేగాక కొన్ని ప్రభుత్వ ఇంటి స్థలాలు తన ఆధీనంలో ఉంచుకున్నట్లు సమాచారంఅతని అవినీతి బాగోతం చేస్తున్న అరాచకాలపై అధికారులు అతనిపై విచారణ చేసి తక్షణమే అతనిని తిరువెంగళపురం పంచాయతీకి విఆర్ఓగా బదిలీ చేశారు కానీ అతను ఇప్పటికీ చెన్నంపల్లి పంచాయతీపై పెత్తనం చేస్తూ పలువురుని బెదిరింపులకు గురి చేస్తున్నాడు ఈ విషయం కూడా తగిన సాక్షాదారాలను కూడా లభించాయి చివరికి స్థలాల హక్కుదారులను కూడా బెదిరించడం వారి నుంచి ముడుపులు దండుకోవడం ఇందుకోసం బద్వేల్ ఆర్డీవో ఆకుల వెంకటరమణ ఎమ్మార్వో మల్లికార్జున్ రెడ్డి పేర్లు ఉపయోగించడం దారుణంగా మారింది ఇతని అవినీతి హవ చెన్నంపల్లి పంచాయతీలో ఇప్పటికీ కొనసాగడం ఆశ్చర్యం నగదు పిండుకోవడం హక్కుదారులను బెదిరించడం ఇతనికి రివాజుగా మారింది ఇక ప్రభుత్వ భూముల కబ్జా విషయానికి వస్తే అడ్డు అదుపు లేకుండా ఉంది బద్వేల్ పట్టణంలో విశాలమైన నాగుల చెరువు ఉంది ఈ చెరువు క్రమంగా కబ్జాలకు గురవుతుంది నెల్లూరుకు వెళ్లే జాతీయ రోడ్డు నుంచి పోరుమామిళ్ళకు వెళ్లే మార్గం వరకు ఈ చెరువు విస్తరించి ఉంది చెరువుకు అన్ని వైపుల నుంచి అక్రమార్కులు కబ్జాలకు పాల్పడుతున్నారు కొంతమంది నాయకులు ఇప్పటికే 12 ఎకరాలు కబ్జా చేసినట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు బద్వేల్ చుట్టూ కొండలు ఉండడంతో వాటిని కూడా కబ్జాదారులు వదిలిపెట్టడం లేదు రహదారి పక్కనే ఉన్న అనేక చెరువులు ఇప్పటికే కబ్జాలపాలయ్యాయి చింతలచెరువు బయనపల్లె చెన్నంపల్లె గోపవరం గుంతపల్లె శ్రీనివాసపురం మడకలవారిపల్లె రూపారంపేట శివాలయం బద్వేలు పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ప్రభుత్వ స్థలాలు ఇప్పటికే కబ్జాలపాలయ్యాయి పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూములు కూడా కబ్జాల గురయ్యాయి బద్వేలు గోపవరం మండలాల్లో కబ్జాలకు గురికాని ప్రభుత్వ స్థలాలంటూ ఏమీ లేవని చెప్పాలిబద్వేల్ లో నకిలీ ఇంటి పట్టాలు నకిలీ అనుబంధ పత్రాలు ఇప్పటికీ రాజ్యమేలుతున్నాయి మొన్నటి వరకు నిశ్శబ్దంగా ఉన్న అక్రమార్కులు ఇప్పుడు చెలరేగిపోతున్నారు బద్వేల్ లో నకిలీ ఇంటి పట్టాలకు నకిలీ అనుబంధ పత్రాలకు అడ్డుకట్ట పడిందని అందరూ భావించారు కానీ అందుకు విరుద్ధంగా ఇప్పుడు జరుగుతుంది ఆర్డీవో గా ఆకుల వెంకటరమణ బాధ్యతలు స్వీకరించిన తర్వాత నకిలీ ఇంటి పట్టాలు నకిలీ అనుబంధ పత్రాలపై పూర్తిగా దృష్టి సారించి వాటిని కొంతవరకు అరికట్టగలిగారు ఇటువంటి వాటిని తయారు చేస్తున్న దాదాపు 26 మంది పై పోలీసులు కేసు నమోదు చేసి వారిలో కొంతమందిని అరెస్ట్ చేశారు మరి కొంతమంది బెయిల్ పై ఉన్నారు మైదుకూరు డిఎస్పి వంశీధర్ గౌడ్ బద్వేల్ అర్బన్ రూరల్ సిఐలు వెంకటేశ్వర్లు హనుమంతు నాయక్ ఎస్సైలు శ్రీకాంత్ కత్తి వెంకటరమణ చంద్రశేఖర్ ఈ విషయంలో కీలక పాత్ర పోషించారు ఇప్పటికీ వారి దృష్టి నకిలీ ఇంటి పట్టాలు నకిలీ అనుబంధ పత్రాలు తయారుచేసి వారి పైన భూములకబ్జాలు చేసే వారి పైన ఉంది తాజాగా బద్వేలు పట్టణంలో ఆర్డిఓ నివాసం ఉంటున్న ఇంటికి అతి సమీపంలో కబ్జాదారులు నకిలీ ఇంటి పట్టాలు నకిలీ అనుబంధ పత్రాలు అడ్డుపెట్టుకొని నిర్మాణ పనులు చేస్తున్నారు పూర్వపు చెన్నంపల్లి పంచాయతీసర్వే నంబర్ 1779/1 లో గత పది రోజులుగా అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు ఇది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం ఈ సర్వే నెంబర్లు బద్వేల్ రెవెన్యూ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి ఇంటి పట్టాలు అనుబంధ పత్రాలు ఇవ్వలేదు ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులే చెబుతున్నారు మండలంలో పనిచేస్తున్న కొంతమంది వీఆర్వోలు వీఆర్ఏలు పంచాయతీ కార్యదర్శులు నకిలీ ఇంటి పట్టాలు నకిలీ అనుబంధ పత్రాలు సృష్టించి కజ్జాదారులకు లక్షల రూపాయలకు విక్రయించినట్లు తెలిసింది గతంలో బద్వేల్ మండల చెన్నంపల్లి విఆర్ఓ గా పనిచేసిన సుధాకర్ ఈ విషయంలో కీలక పాత్ర పోషించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి

# రైతు రక్షణ కాలినడక యాత్ర ను జయప్రదం చేయాలని గోడపత్రిక విడుదల: సిపిఐ




ఎమ్మిగనూరు, ఎమ్మిగనూరు పట్టణంలో అధిక వర్షాల వల్ల, నకిలీ విత్తనాలు వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిసెంబర్ 16 మంత్రాలయం నుంచి 20 తేది కర్నూల్ వరకు రైతు రక్షణ కాలినడక యాత్రను జయప్రదం చేయాలని సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో గోడ పత్రిక విడుదల చేయడం జరిగిందని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్న గౌడ్, సిపిఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నష్టపోయిన రైతన్న ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి వైఫల్యం చెందిందని, పైగా నకిలీ విత్తనాలు రైతులకు అంటగట్టి ఉమ్మడి జిల్లాలో ఐదు లక్షల ఎకరాలలో పంట

నష్టం జరిగిందని, దీనిపై పూర్తిగా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించకుండా వెయ్యి మంది రైతులకు మాత్రమే నష్టం వాటిల్లిందని నివేదిక ఇవ్వడం వెనక పలు అనుమానాలు ఉన్నాయని ఈ సందర్భంగా వారు తెలిపారు. కాబట్టి అధిక వర్షాల కారణంగా నష్టపోయిన పత్తి వేరుశనగ ఆముదం పంటలకు ఎకరాకు 40,000, ఉల్లి మిరప పంటలు 60 వేల రూపాయలు నష్టపరమైన ఇవ్వాలని సిపిఐ గా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది. పంటల బీమా పథకం పూర్తి స్థాయిలో వర్తింపజేసి, ఖరీఫ్ సీజన్లో రైతుల బ్యాంకులలో తీసుకున్న పంట రుణాలను రద్దు చేయాలని అదే విధంగా గ్రామాల్లో తరలి వెళుతున్న వలసలు నివారించే ఉపాధి కల్పించాలని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తక్షణమే నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడానికి స్పందించకపోతే రాష్ట్ర ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని రైతు సంఘం నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్,పట్టణ సహాయ కార్యదర్శిలు బాలరాజు,సమీవుల్లా, మండల కార్యదర్శి చిన్నన్న రైతు సంఘం నాయకులు సత్తన్న, బజారి,జబ్బర్, విజేంద్ర, తిమ్మ గురుడు, రామంజి, నరసింహులు, సుంకన్న,హమాలి వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల కలెక్టరేట్ ముట్టడి

నెల్లూరు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ నెల్లూరు నగర శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆఫీస్ ముట్టడి టెన్షన్ రేపింది.వర్షాన్ని సైతం లెక్కచేయకుండా విద్యార్థుల సమస్యల పరిష్కరం కోసం నినాదాలతో దద్దరిల్లిన కలెక్టర్ కార్యాలయం లో ఉద్రిక్తతకు దారి తీసిన ముట్టడి లో పలువురు విద్యార్థి నాయకులకు గాయాలయ్యాయి.పోలీసులు విద్యార్ది నాయకులపై చేయి చేసుకోవడాన్ని వారు ఖండిచారు. కలెక్టర్ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన కమిషనర్ కారును అడ్డుకున్న విద్యార్థి నాయకులను పోలీసులు లాగి పడేశారు..

# కింగ్ ఫిక్స్ అయ్యేది 2024 లోనే!

కింగ్ నాగార్జున 'ది ఘోస్ట్' రిలీజ్ తర్వాత కొత్త ప్రాజెక్ట్ ప్రకటించని సంగతి తెలిసిందే. భారీ అంచనాల మధ్య రిలీజ్ అయిన ఘోస్ట్ వాటిని అందుకోవడంలో విఫలమైంది. ఈ కథ కోసం నాగార్జున చాలా సమయాన్నే వెచ్చించారు. అయినా శ్రమంతా వృద్ధాగానే పోయింది. దీంతో నాగార్జున మరింత లోతుగా ఆలోచించాల్సిన అవసరం పడింది. ఈనేపథ్యంలో కింగ్ నుంచి కొత్త కమిట్ మెంట్ వివరాలు రావడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉందని



తెలుస్తోంది.అయితే ఇప్పటికే నాగార్జునకు ముగ్గురు ..నలుగురు మేకర్స్ కథలు చెప్పినట్టు తెలుస్తోంది. ఇటీవలే 'గాడ్ ఫాదర్' తో సక్సెస్ అందుకున్న మోహన్ రాజా నాగార్జునకి ఓ కథ వినిపించినట్లు తెలిసింది.దీనిపై నాగ్ పాజిటివ్ గానే ఉన్నట్లు వార్తలొచ్చాయి. ఈ కథని మెగాస్టార్ చిరంజీవి కూడా విన్న తర్వాతే కింగ్ వద్దకు వచ్చినట్లు వార్తలొచ్చాయి. చిరు వద్ద పాస్ అవ్వడంతోనే రాజా నాగార్జున వరకూ వచ్చాడని ప్రచారం సాగింది.అలాగే తమిళ దర్శకుడు విక్రమ్. కె. కుమార్ కూడా నాగార్జునకు ఇప్పటికే ఓ స్క్రిప్ట్ కూడా వినిపించారుట. అదీ కూడా బాగా నచ్చడంతో చేద్దామని ప్రామిస్ చేసినట్లు సమాచారం. విక్రమ్ సక్సెస్ నేపథ్యంలో ఛాన్సెస్ ఎక్కువగానే కనిపిస్తున్నాయి. మరోవైపు ఓ కొత్త రచయిథ పట్ల కూడా నాగ్ సానుకూలంగానే ఉన్నట్లు తెలిసింది. ఇది ఓ డిఫరెంట్ జానర్ సినిమా అట.విక్రమ్....మోహన్ రాజా కథలకు పూర్తి భిన్నంగా ఉంటుందని సమాచారం. ఈ నేపథ్యంలో నాగార్జున కూడా డైలమాలో ఉన్నట్లు వినిపిస్తుంది. ఇలా ముగ్గురు విషయంలో నాగార్జున పాజిటివ్ గానే ఉన్నారు. చేద్దాం అని మాటిచ్చారు తప్ప అగ్రిమెంట్ జరిగింది లేదు. ఈ నేపథ్యంలో వీటన్నింటిపై కొత్త ఏడాది 2024 లోనే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.తదుపరి ఏ సినిమా చేసినా అది హిట్ అవ్వాలి. అభిమానుల్ని నిరుత్సాహ పరచడానికి తావు ఇవ్వ కూడదు. కింగ్ కి సోలో సక్సెస్ పడి చాలా కాలమవుతోంది. ఈనేపథ్యంలో తదుపరి ఏ దర్శకుడితో పనిచేసినా అది కమర్శియల్గా పెద్ద హిట్ అవ్వాలన్న ది నాగ్ ఐడియా గా తెలుస్తోంది. అందుకే కొత్త సినిమా విషయంలో అన్ని రకాలుగా ఆలోచించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. మరి కింగ్ ఎలాంటి ప్రకటనతో ముందుకొస్తారో చూడాలి.




# ఆ నలుగురు ఒకే మాట..ఒకే బాట..ఇదే సత్యం!

ప్రస్తుతం థియేటర్ నిర్వహణ వ్యవస్థలో ఎన్నో మార్పులొచ్చిన సంగతి తెలిసిందే. పంపిణీ రంగంలో అగ్రగామిగా ఉన్నవారో? నిర్మాతలో సొంతంగా థియేటర్లను నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించి ప్రత్యేక చైన్ వ్యవస్థ అనేది ఒకటుంది. ఒకప్పటి వ్యవస్థ ఇందుకు భిన్నంగా ఉండేది. థియేటర్ నిర్వహకుడు ఒకరు..పంపిణీదారులు వేరుగా..బయ్యర్లు వేరుగా ఉండేవారు.పాక్షికంగా అక్కడక్కడా ఇప్పటికీ కనిపించినా చాలా థియేటర్లు మూత పడటంతో ఈ విధానం కనుమరుగవుతోంది. సినిమా బిజినెస్ అనేది పూర్తిగా ఇండస్ట్రీతోనే ముడిపడిపోయింది. ఈ క్రమంలో థియేటర్లు ఫంక్షన్ హాల్స్



గాను మారిపోయాయి. థియేటర్ లో సినిమాకి ఆదరణ అంతంత మాత్రంగా ఉండటం సహ నిర్వహణ భారం కావడంతో నిర్మాణ వ్యవస్థలో ఎన్నో మార్పులొ చ్చాయి.తాజాగా థియేటర్ సమస్యలు తలెత్తిన నేపథ్యంలో ఆ నలుగురు చేతిల్లోనే థియేటర్లు లాక్ అవుతున్నాయని నేరుగా కొంతమంది అగ్ర నిర్మాతలే సీన్ లోకి వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా వీటిపై ఓ ఇంటర్వ్యూలో దిల్ రాజు ఆసక్తికరంగా స్పందించారు. ప్రస్తుతం డిస్ట్రిబ్యూషన్ విధానం ఎలా ఉందో వివరించారు. అలాగే సంక్రాంతికి విడుదలవుతున్న సినిమాల నిర్మాతలకు గొడవలు లేకపోయినా నిర్మాతల మండలి సమస్య ఏంటని ప్రశ్నించారు. ఇదే తరహాలోనే నిర్మాతలు అల్లు అరవింద్ సురేష్ బాబు కూడా ఇలాంటి అభిప్రాయాల్నే వ్యక్త పరిచారని గుర్తు చేసారు.'థియేటర్లు వ్యవస్థ క్షీణించిన దశలో...సినిమా వ్యాపారం తగ్గుతున్నప్పుడు మేము థియేటర్లను తీసుకొని ప్రేక్షకుల అవసరాలకు అనుగుణంగా వాటిని మార్పు చేసాం. ఎన్నో థియేటర్లను సొంతంగా తీసుకుని రెన్నో వేషన్ చేసాం. ఈ క్రమంలోనే చాలా థియేటర్లను మేము సొంతంగా కలిగి ఉన్నాం. కొన్ని థియేటర్లను లీజుకు తీసుకున్నాం. కాబట్టి మాకు థియేటర్లు ఉన్నాయని నిందించడం తప్పు అవుతుందని' అభిప్రాయపడ్డారు.సంక్రాంతికి పెద్ద సినిమాలకు ఇచ్చే థియేటర్ల గురించి సురేష్ బాబు ని ప్రశ్నించగా ఆయనా ఆసక్తికర వ్యాఖ్యలు చేసారు. 'నా ప్రొడక్షన్ వెంచర్స్కి నైజాంలో థియేటర్లు దొరికేవి కావు. అప్పుడే థియేటర్లు నేను సొంతంగా సంపాదించడం మొదలుపెట్టాను. ఇప్పుడు కూడా పెద్ద సినిమాలకు డిస్ట్రిబ్యూటర్లు మరియు ఎగ్జిబిటర్లతో ఉన్న సంబంధాల ఆధారంగా థియేటర్లు లభిస్తాయి. కొన్ని సందర్భాల్లో సినిమాలకు థియేటర్లు దొరకడం ఇప్పటికీ కష్టంగానే ఉంటుంది. ఆ కారణంగా కొంతమంది మమ్మల్ని నిందిస్తారు. కానీ నేను దాని గురించి పెద్దగా పట్టించుకోను ' అని అన్నారు. ఆ వ్యాఖ్యల్ని బట్టి ఆ ముగ్గురు ఒకే గొడుగు కింద ఉన్నట్లు తెలుస్తోంది. నిర్మాతల మండలిలో తలెత్తిన వివాదం నేపథ్యంలో సమాధానమిచ్చే విషయంలో అరవింద్.. రాజుగారు.. సురేష్ బాబు సహా అగ్ర నిర్మాతలంతా ఒకే మాట మీద ఉన్నట్లు తెలుస్తోంది.

# జట్టులోకి కుల్దీప్ యాదవ్.. రోహిత్ గాయంపై బీసీసీఐ అప్‌డేట్

బంగ్లాదేశ్‌తో మూడో వన్డేకు చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు టీమిండియాలో చోటు దక్కింది. నేపథ్యంలో అతడు జట్టుతో కలవనున్నాడు. కాగా బంగ్లాదేశ్‌తో రెండో వన్డేలో ఓటమి పాలై సిరీస్ చేజార్చుకున్న టీమిండియా శనివారం నాటి ఆఖరి మ్యాచ్‌కు సిద్ధమవుతోంది. కనీసం ఒక్క మ్యాచ్ అయినా గెలిచి పరువు దక్కించుకోవాలని భావిస్తోంది.ఇక రెండో వన్డే సందర్భంగా టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ గాయపడ్డ విషయం తెలిసిందే. టాస్ ఓడి ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో రోహిత్ చేతి వేలికి గాయమైంది. దీంతో అతడిని ఆస్పత్రికి తీసుకువెళ్లి పరీక్షలు చేయించారు. అయితే,నొప్పిని భరిస్తూనే మైదానంలో అడుగుపెట్టి అద్భుత ఇన్నింగ్స్‌ఆడినప్పటికీ రోహిత్ శ్రమ వృథాగా పోయింది.మరోవైపు.. యువ పేసర్ కుల్దీప్ సేన్ వెన్ను నొప్పితో రెండో వన్డేకు దూరం కాగా.. దీపక్ చహర్‌ను సైతం ఫిట్‌నెస్ సమస్యలు వేధిస్తున్నాయి. రెండో మ్యాచ్ సందర్భంగా అతడు కూడా గాయపడ్డాడు. ఈ నేపథ్యంలో వీరు ముగ్గురు ఆఖరి మ్యాచ్‌కు అందుబాటులో లేకుండా పోయారు. ఈ క్రమంలో కుల్దీప్ యాదవ్‌ను జట్టుకు ఎంపిక చేసినట్లు బీసీసీఐ శుక్రవారం ప్రకటన విడుదల చేసింది.అదే విధంగా... రోహిత్ శర్మ, కుల్దీప్ సేన్, దీపక్ చహర్ స్వదేశానికి తిరిగి వచ్చారని పేర్కొంది. రోహిత్ చికిత్స కోసం ముంబై ఆస్పత్రిలో స్పెషలిస్టును సంప్రదించగా.. కుల్దీప్, దీపక్ బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీకి వెళ్లనున్నట్లు తెలిపింది. ఇక కెప్టెన్ రోహిత్ టెస్టు సిరీస్‌కు అందుబాటులో ఉంటాడో లేదోనన్న అంశంపై వీలైనంత త్వరగా అప్‌డేట్ ఇస్తామని మేనేజ్‌మెంట్ పేర్కొంది.



బంగ్లాదేశ్‌తో మూడో వన్డేకు భారత జట్టు:కేఎల్ రాహుల్ (కెప్టెన్/వికెట్ కీపర్), శిఖర్ ధావన్, విరాట్ కోహ్లీ, రజత్ పాటిదార్, శ్రేయస్ అయ్యర్, రాహుల్ త్రిపాఠి, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), షాబాజ్ అహ్మద్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, మహ్మద్ సిరాజ్, ఉమ్రాన్ మాలిక్, కుల్దీప్ యాదవ్.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**